


# ఆకాంక్ష

T/TG/2024/0523/7229/1544
తెలుగు సంచలన దిన పత్రిక




పబ్లిష్ : తెలంగాణ ఆదివారం 06 -07-2025 సంపుటి : 01 సంచిక :207 ఎడిటర్ : పెనుగొండ సతీష్ పేజీలు : 08 వెల : 05 రూ /-

published Frome : Hyderabadh, vijayavada, karimnagar, chitur, khammam, warangal, nalgonda, rajamandri, visakapatnam, mahabub nagar, prakasham,nijambad, rajana sirisilla

# పనివేళల్లో సవరణ



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

రోజుకు 10 గంటల వరకు పని:ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- ఉద్యోగుల పని వేళల పరిమితిని సవరించిన ప్రభుత్వం
- రోజుకు 10 గంటల వరకు పని చేసేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు
- వారంలో పని వేళలు 48 గంటలకు మించరాదని ఉత్తర్వులు

**తెలంగాణ, ఆకాంక్ష :**

తెలంగాణలోని వాణిజ్య సంస్థల్లో ఉద్యోగుల పనివేళలను మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై రోజుకు పది గంటల వరకు పనిచేయవచ్చు, కానీ వారానికి 48 గంటలు మించకూడదు. పరిమితి దాటితే ఓవర్‌టైమ్ చెల్లించాలని, ఆరు గంటల పని తర్వాత అరగంట విరామం ఇవ్వాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయం వ్యాపారాలను సులభతరం చేయడంతో పాటు ఉద్యోగుల శ్రేయస్సును కాపాడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని వాణిజ్య సంస్థల ఉద్యోగుల పనివేళలను సవరిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ కొత్త నిబంధనల ప్రకారం.. ఉద్యోగులు రోజుకు పది గంటల వరకు పని చేసేందుకు అనుమతించబడతారు. అయితే వారంలో మొత్తం పనివేళలు 48 గంటలు మించకూడదని కూడా పేర్కొన్నారు. వారం పరిమితిని దాటినట్లయితే.. యాజమాన్యాలు తప్పనిసరిగా ఉద్యోగులకు ఓవర్‌టైమ్ (%ూ%) వేతనం చెల్లించాలని ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. ఇది ఉద్యోగుల శ్రమకు తగిన ప్రతిఫలం లభించేలా చూస్తుంది. అంతేకాకుండా.. రోజులో ఆరు గంటల పని

మిగతాది 2 లో...

# ఆదాయ సమానత్వంలో భారత్ సత్తా

ఆదాయ సమానత్వంలో ప్రపంచంలో 4వ స్థానంలో నిలిచిన భారత్
అమెరికా, చైనా, జీ7, జీ20 దేశాలను అధిగమించిన వైనం
ప్రపంచ బ్యాంకు తాజా గిని సూచీ గణాంకాలలో వెల్లడి
2011-23 మధ్య 17 కోట్ల మంది పేదరికం నుంచి బయటకు
2.3 శాతానికి పడిపోయిన తీవ్ర పేదరికపు రేటు
జన్ ధన్, ఆధార్, ఆయుష్మాన్ భారత్ పథకాలే కీలకమన్న నివేదిక

**న్యూ ఢిల్లీ, ఆకాంక్ష :**

ఆదాయ సమానత్వం విషయంలో భారతదేశం ప్రపంచంలోనే ఒక ఆదర్శవంతమైన దేశంగా నిలుస్తోంది. ప్రపంచ బ్యాంకు విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, ఆదాయ పంపిణీలో అసమానతలను కొలిచే 'గిని సూచీ'లో భారత్ అద్భుతమైన ప్రగతి సాధించి, ప్రపంచంలోనే 4వ స్థానంలో నిలిచింది. స్లోవాక్ రిపబ్లిక్, స్లోవేనియా, బెలారస్ మాత్రమే



మిగతాది 2 లో...

# మహిళలకు మరో తీపి కబురు

ల్యాండ్ రిజిస్ట్రేషన్లలో స్టాంప్ డ్యూటీ తగ్గింపు
తెలంగాణ ప్రభుత్వం త్వరలో స్టాంప్ సవరణ బిల్లు-2025
మహిళలకు స్టాంప్ డ్యూటీలో ప్రత్యేక తగ్గింపు
ఆస్తి విలువలో 6% స్టాంప్ డ్యూటీగా విధించే అవకాశం

**తెలంగాణ, ఆకాంక్ష :**

తెలంగాణ ప్రభుత్వం త్వరలో స్టాంప్ సవరణ బిల్లు-2025ను తీసుకురానుంది. దీని ద్వారా భూముల ధరలు సవరించబడతాయి. మహిళలకు స్టాంప్ డ్యూటీలో ప్రత్యేక తగ్గింపు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆస్తి విలువలో 6% స్టాంప్ డ్యూటీగా విధించే అవకాశం ఉంది. రిజిస్ట్రేషన్ ఛార్జీలు 0.5%, బదిలీ సుంకం 1.5%గా ఉండనున్నాయి. ఈ నిర్ణయం మహిళా సాధికారతకు, రియల్ ఎస్టేట్ రంగంలో పారదర్శకతకు దోహదపడుతుందని భావిస్తున్నారు.



మిగతాది 2 లో...

# ఓటరు జాబితా నుంచి ఆ మాజీ ఎమ్మెల్యే పేరు తొలగింపు..



**తెలంగాణ, ఆకాంక్ష :**

తెలంగాణ రాజకీయాల్లో సంచలనం! వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ పేరును ఓటరు జాబితా నుండి తొలగిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఆయన భారత పౌరుడు కాదంటూ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చేసిన న్యాయపోరాటమే దీనికి కారణం. హైకోర్టు తీర్పుతో రమేష్‌కు పౌరసత్వం లేదని తేలడంతో ఈ చర్య తీసుకున్నారు. ఈ పరిణామం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. దీనిపై చెన్నమనేని రమేశ్ నుంచి ఎలాంటి స్పందన రాలేదు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. తెలంగాణ రాజకీయ రంగంలో పెను సంచలనం నెలకొంది. వేములవాడ నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు చెన్నమనేని రమేష్ పేరును ఓటరు జాబితా నుండి అధికారులు తొలగించారు. ఈ నిర్ణయంతో ఆయన నివాస గృహం ఎదుట అధికారిక ప్రకటనలు వెలువడ్డాయి. ఇది రాష్ట్రవ్యాప్తంగానే గాక.. యావత్ దేశంలోనే ఒక విభిన్న చర్చకు దారితీసిన విషయం. ఒక ప్రముఖ రాజకీయ నాయకుడు, నాలుగు పర్యాయాలు శాసనసభ్యుడిగా ఎన్నికైన వ్యక్తి ఓటరు జాబితా నుంచి తొలగించబడటం భారతదేశ చరిత్రలోనే అసాధారణ పరిణామంగా నిలిచింది. ఈ పరిణామాల వెనుక ప్రభుత్వ విప్,

మిగతాది 2 లో...

# రేవంత్ కు బేసిన్ లు తెలియదు..బెండకాయలు తెలియదు

- రైతు సమస్యలపై చర్చకు సిద్ధంగా ఉన్నామన్న కేటీఆర్
- సోమాజిగూడ ప్రెస్ క్లబ్ కు రావాలని సవాల్
- అన్నదాతకు సున్నం పెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని విమర్శ

**తెలంగాణ, ఆకాంక్ష :**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సాగునీటి ప్రాజెక్టులు, రైతు సమస్యలపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించిన కేటీఆర్, సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ సవాల్ విసిరారు. ఈ నెల 8వ తేదీ ఉదయం 11 గంటలకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌కు తాము వస్తామని, చర్చకు సిద్ధపడేందుకు సీఎంకు 72 గంటల సమయం ఇస్తున్నామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రికి బేసిన్‌ల గురించి గానీ, ప్రాజెక్టుల గురించి గానీ కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ నీళ్లు ఆంధ్రాకు, నిధులు ఢిల్లీకి తరలిపోతున్నాయని, నియామకాలు ఆయన వ్యక్తులకే దక్కుతున్నాయని ఆరోపించారు. సమైక్య రాష్ట్రంలో నీళ్ల వాటాలో అన్యాయం జరగడం వల్లే తెలంగాణ ఉద్యమం పుట్టిందని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం రైతుబంధును నాట్లు వేసే సమయంలో ఇస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్లు వచ్చే ముందు రైతు భరోసా ఇస్తోందని విమర్శించారు. ఇప్పటివరకు రైతులకు ఎకరానికి 19 వేల రూపాయలు ఎగ్గొట్టి అన్నదాతకు సున్నం పెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. చంద్రబాబుకు



మిగతాది 2 లో...

# నిఫా వైరస్ కలకలం

- కేరళలో మళ్లీ విజృంభించిన నిఫా వైరస్
- మలప్పురంలో 18 ఏళ్ల యువతి మృతి
- మృతురాలికి చికిత్స అందించిన 43 మంది వైద్య సిబ్బందికి క్వారంటైన్

**న్యూ ఢిల్లీ, ఆకాంక్ష :**

కేరళలో ప్రాణాంతక నిఫా వైరస్ మళ్లీ



కలకలం రేపుతోంది. ఈ వైరస్ కారణంగా ఓ యువతి మృతి చెందింది. మరొకరు చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో, రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు కీలక

మిగతాది 2 లో...

# ట్రంప్‌కు మోదీ తలొగ్గుతారు..

గోయల్ గుండెలు బాదుకుంటారు: రాహుల్ గాంధీ

అమెరికా సుంకాలకు ప్రధాని మోదీ తలొగ్గుతారని రాహుల్ విమర్శ
మంత్రి పీయూష్ గోయల్ గుండెలు బాదుకోవడం ఖాయమన్న రాహుల్
జులై 9 గడువులోగా భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై తీవ్ర చర్చలు
గడువుల కోసం ఒప్పందాల్లో తొందరపడబోమని స్పష్టం చేసిన కేంద్రం

**న్యూ ఢిల్లీ, ఆకాంక్ష :**

అమెరికాతో వాణిజ్య ఒప్పందం విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



విధించిన సుంకాలకు ప్రధాని మోదీ తలొగ్గుతారని, ఈ విషయంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ గుండెలు బాదుకోవడం తప్ప ఏమీ చేయలేరని ఆయన

మిగతాది 2 లో...

## పనివేళల్లో సవరణ

తర్వాత కనీసం అరగంట విశ్రాంతి ఇవ్వడం తప్పనిసరిగా పేర్కొన్నారు. విశ్రాంతి సమయంతో కలిపి, ఒక ఉద్యోగిని పన్నెండు గంటల కంటే ఎక్కువ పని చేయించరాదని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నిబంధనలు ఉద్యోగుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, వారి పని జీవిత సమతుల్యతకు భరోసా కల్పిస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ పనివేళల సవరణ, వ్యాపార కార్యకలాపాలను సులభతరం చేయాలనే ప్రభుత్వ సంకల్పంలో భాగంగా వచ్చింది. ఇది పెట్టుబడులను ఆకర్షించడానికి, వ్యాపార విస్తరణకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడానికి దోహదపడుతుంది. గతంలో.. పనివేళలపై ఉన్న కొన్ని కఠిన నిబంధనలు వ్యాపారాలకు ఇబ్బందికరంగా మారేవని, ఈ సవరణల ద్వారా ఆ అడ్డంకులు తొలగిపోతాయని వ్యాపార వర్గాలు ఆశిస్తున్నాయి.

### కార్మికుల ప్రయోజనాల కోసం..

అయితే.. ఈ మార్పులు ఉద్యోగుల హక్కులకు భంగం కలిగించకుండా, వారి శ్రేయస్సును కాపాడేలా పటిష్టమైన అమలు యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి. పనివేళల పరిమితి, ఓవర్‌టైమ్ చెల్లింపు, విశ్రాంతి సమయాలపై పారదర్శకత, పర్యవేక్షణ చాలా అవసరం. ఈ నూతన నిబంధనలు తెలంగాణలో పారిశ్రామిక, వాణిజ్య రంగాల వృద్ధికి దోహదపడతాయని, అదే సమయంలో కార్మికుల ప్రయోజనాలను కూడా కాపాడతాయని ప్రభుత్వం ఆశిస్తోంది. ఈ సంస్కరణలు రాష్ట్రంలో ఉద్యోగుల హక్కులు, వ్యాపార వృద్ధి మధ్య సమతుల్యతను సాధించడంలో కీలక పాత్ర పోషించనున్నాయి.

## రేవంత్ కు బేసిన్ లు తెలియదు..బెండకాయలు తెలియదు

కోవర్ట్ అని ఓ కాంగ్రెస్ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ సమర్థించారు. ఆ ఎమ్మెల్యే చాలా కరెక్టుగా చెప్పారని, ఆయనను అభినందిస్తున్నానని పేర్కొన్నారు. తాము కల్పించిన ఉద్యోగాలను కూడా కాంగ్రెస్ తమ ఖాతాలో వేసుకుంటూ సిగ్గులేకుండా ప్రచారం చేసుకుంటోందని మండిపడ్డారు. సీఎం తన సభల్లో బూతులు మాట్లాడుతూ రంకెలు వేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. చర్చకు కేసీఆర్ అవసరం లేదని, తామే చాలని అన్నారు. మందబలంతో కాకుండా 10-15 మందితోనే ప్రెస్‌క్లబ్‌కు వస్తామని, మీడియా ముందే అన్ని విషయాలు తేల్చుకుందామని కేటీఆర్ స్పష్టం చేశారు.

## నిఫా వైరస్ కలకలం

జిల్లాల్లో హైఅలర్ట్ ప్రకటించింది. వివరాల్లోకి వెళితే, మలప్పురం జిల్లాకు చెందిన 18 ఏళ్ల ఇంటర్ విద్యార్థిని నిఫా బారిన పడి జులై 1న ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మృతి చెందింది. తీవ్రమైన జ్వరం, వాంతులతో బాధపడుతున్న ఆమెను కొట్టక్కల్‌లోని ఆసుపత్రికి తీసుకురాగా, అప్పటికే బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇదే సమయంలో, పాలక్కాడ్‌కు చెందిన 39 ఏళ్ల మహిళ కూడా ఇదే వైరస్‌తో బాధపడుతున్నట్లు తేలింది. వీరిద్దరి నమూనాలను పూణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపగా, నిఫా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఈ పరిణామంతో కేరళ ఆరోగ్య శాఖ వెంటనే రంగంలోకి దిగింది. ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్.. కోజికోడ్, మలప్పురం, పాలక్కాడ్ జిల్లాల్లో హైఅలర్ట్ జారీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ముందుజాగ్రత్త చర్యగా, మరణించిన యువతికి చికిత్స అందించిన 43 మంది ఆరోగ్య సిబ్బందిని క్వారంటైన్‌లో ఉంచారు. నిఫా అనేది జంతువుల నుంచి, ముఖ్యంగా గబ్బిలాలు, పందుల ద్వారా మనుషులకు వ్యాపించే ఒక వైరల్ వ్యాధి. ఇది సోకిన వారిలో తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులతో పాటు మెదడువాపు (ఎన్‌సెఫలైటిస్) లేదా తీవ్ర శ్వాసకోశ సమస్యలకు దారితీస్తుంది. దీనికి నిర్దిష్టమైన చికిత్స లేకపోవడంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ దీనిని అత్యంత ప్రమాదకరమైన వ్యాధుల్లో ఒకటిగా పరిగణిస్తోంది.

## ఓటరు జాబితా నుంచి ఆ మాజీ ఎమ్మెల్యే పేరు తొలగింపు

ప్రస్తుత వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ సుదీర్ఘకాలంగా సాగించిన న్యాయపోరాటం కీలకం. చెన్నమనేని రమేష్ భారత పౌరుడు కాదంటూ ఆయన పలుమార్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ కృషి ఫలితంగానే రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం తెలంగాణ హైకోర్టు ఇటీవలే ఒక కీలకమైన తీర్పును వెలువరించింది. ఆ తీర్పులో.. చెన్నమనేని రమేష్‌కు భారత పౌరసత్వం లేదని స్పష్టం చేయబడింది. కోర్టు తీర్పు వెలువడిన వెంటనే.. ఆది శ్రీనివాస్ సత్వరం స్పందించి, తీర్పును తక్షణం అమలు చేయాలని, మాజీ శాసనసభ్యుడి పేరును ఓటరు జాబితా నుండి తొలగించాలని సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. దీని ఆధారంగా.. అధికారులు ఆయన పేరును ఓటరు జాబితా నుంచి తొలగించి, ఆయన నివాసం ముందు నోటీసులు అతికించారు. ఈ నోటీసులపై ఇప్పటివరకు చెన్నమనేని రమేష్ నుండి ఎటువంటి అధికారిక స్పందన రాలేదు. గతంలో కూడా అధికారులు పౌరసత్వ వివాదంపై నోటీసులు జారీ చేయగా.. వాటికి సరైన సమాధానం రాలేదు. తాజాగా ఇప్పుడు ఓటరు జాబితా నుండి పేరును తొలగించే చర్యలు తీసుకున్నారు. ఈ పరిణామం చెన్నమనేని రమేష్ రాజకీయ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసింది. భారత పౌరసత్వం లేని వ్యక్తి దేశంలో ఓటు వేయడానికి, ఎన్నికల్లో పోటీ చేయడానికి రాజ్యాంగబద్ధంగా అనర్హుడు. ఒకవేళ ఆయన ఈ తీర్పును సవాలు చేస్తూ ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయించినా.. హైకోర్టు తీర్పును రద్దు చేయించుకోవడం ఆయనకు ఒక పెద్ద అగ్నిపరీక్షగానే మారనుంది. ఈ ఘటన తెలంగాణ రాజకీయాల్లో, ముఖ్యంగా వేములవాడ నియోజకవర్గంలో, కొత్త రాజకీయ సమీకరణలకు దారితీయవచ్చు. అంతేకాకుండా.. ఈ కేసు భవిష్యత్తులో భారత పౌరసత్వ చట్టాలు, ఎన్నికల నిబంధనల అమలుకు ఒక ముఖ్యమైన ఉదాహరణగా నిలిచే అవకాశం ఉంది. ఈ మొత్తం వ్యవహారం దేశ పౌరసత్వ నియమాలు, ఎన్నికల చట్టాల పటిష్టత, వాటిని అమలు చేయడంలో న్యాయవ్యవస్థకు సంబంధించి నిష్పక్షపాత పాత్రను మరోసారి బట్టబయలు చేసింది. ఈ పరిణామంపై రాజకీయ పరిశీలకులు, న్యాయ నిపుణులు నిశితంగా విశ్లేషిస్తున్నారు.

# ఆదాయ సమానత్వంలో భారత్ సత్తా

భారత్ కంటే ముందున్నాయి. అమెరికా, చైనాతో పాటు జీ7, జీ20 కూటమిలోని అన్ని అగ్ర దేశాలను భారత్ వెనక్కి నెట్టడం విశేషం. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం, భారత్ 'గిని సూచీ' స్కోరు 25.5గా నమోదైంది. ఇదే సమయంలో చైనా (35.7), అమెరికా (41.8) వంటి దేశాలు భారత్ కంటే చాలా వెనుకబడి ఉన్నాయి. 2011లో 28.8గా ఉన్న 'గిని' స్కోరు ఇప్పుడు గణనీయంగా మెరుగుపడటం, దేశ ఆర్థిక ప్రగతి ఫలాలు ప్రజలందరికీ సమానంగా అందుతున్నా యనడానికి నిదర్శనమని సాంఘిక సంక్షేమ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ ఘనత వెనుక దేశంలో పేదరికాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న స్థిరమైన విధానాలే ప్రధాన కారణమని ప్రపంచ బ్యాంకు తన నివేదికలో స్పష్టం చేసింది. 2011 నుంచి 2023 మధ్య కాలంలో దేశంలో సుమారు 17.1 కోట్ల మంది తీవ్ర పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపింది. ఇదే సమయంలో, రోజుకు 2.15 డాలర్ల ఆదాయాన్ని ప్రామాణికంగా తీసుకుంటే, దేశంలో పేదరికపు రేటు 16.2 శాతం నుంచి కేవలం 2.3 శాతానికి పడిపోయింది. ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన ద్వారా 55 కోట్లకు పైగా బ్యాంకు ఖాతాలు తెరవడం, ఆధార్ ద్వారా 142 కోట్ల మందికి ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) సేవలు అందించడం వంటి కార్యక్రమాలు ఈ మార్పునకు దోహదపడ్డాయి. డీబీటీ ద్వారా మార్చి 2023 నాటికి రూ.3.48 లక్షల కోట్లు ఆదా అయినట్లు నివేదిక వెల్లడించింది. వీటితో పాటు, ఆయుష్మాన్ భారత్ కింద 41 కోట్ల మందికి ఆరోగ్య రక్షణ, పీఎం గరీబ్ కల్యాణ్ అన్న యోజన ద్వారా 80 కోట్ల మందికి ఆహార భద్రత కల్పించడం వంటి పథకాలు కూడా ఆదాయ సమానత్వాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషించాయి.

# మహిళలకు మరో తీపి కబురు

రిజిస్ట్రేషన్లో మహిళలకు స్టాంప్ డ్యూటీ తగ్గింపు తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు ఊరటనిచ్చేలా కీలక నిర్ణయం తీసుకుంది. వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచే లక్ష్యంతో త్వరలో కొత్త స్టాంప్ సవరణ బిల్లు-2025ను తీసుకురానున్నట్లు ప్రకటించింది. ఈ బిల్లులో భాగంగా ప్రస్తుత మార్కెట్ విలువలకు అనుగుణంగా భూముల ధరలను సవరించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచించారు. ఈ నిర్ణయాల మధ్య, మహిళలకు ప్రత్యేకంగా స్టాంప్ డ్యూటీలో తగ్గింపు ఇవ్వాలని ప్రభుత్వం ఒక సంచలనాత్మక తీర్మానం చేసింది. ఇది మహిళా సాధికారతకు, వారి ఆర్థిక భద్రతకు దోహదపడుతుందని భావిస్తున్నారు. కొత్త స్టాంప్ సవరణ బిల్లు-2025 అమల్లోకి వస్తే.. స్టాంపు డ్యూటీ ఆస్తి విలువలో 6 శాతంగా విధించే అవకాశం ఉంది. ఈ మొత్తంలో రిజిస్ట్రేషన్, బదిలీ ఛార్జీలు కూడా చేర్చబడతాయి. ఆస్తి రిజిస్ట్రేషన్ సమయంలో ఆస్తి విలువలో 0.5 శాతం రిజిస్ట్రేషన్ ఛార్జీలు వసూలు చేయనున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా.. ఆస్తి ఇతరుల పేరిట బదిలీ చేసినప్పుడు, ఆస్తి విలువలో 1.5 శాతం బదిలీ సుంకం చెల్లించేలా చట్టంలో పొందుపరచనున్నారు. ఈ మార్పులు రియల్ ఎస్టేట్ రంగానికి, సాధారణ ప్రజలకు స్పష్టతను, స్థిరత్వాన్ని ఇస్తాయని అంచనా.

### మహిళలకు ప్రత్యేక రాయితీ..

ఈ నూతన విధానం ద్వారా మహిళలకు స్టాంప్ డ్యూటీలో ప్రత్యేక రాయితీ లభించడం ఒక విప్లవాత్మక చర్యగా భావించవచ్చు. ఇది మహిళలు ఆస్తులను తమ పేరు మీద రిజిస్టర్ చేసుకోవడాన్ని ప్రోత్సహిస్తుంది. తద్వారా వారికి ఆర్థిక భద్రతను, సామాజిక గుర్తింపును అందిస్తుంది. కుటుంబంలో మహిళల ప్రాధాన్యతను పెంచడంతో పాటు, వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలనే ప్రభుత్వ లక్ష్యానికి ఇది అద్దం పడుతుంది. ఈ బిల్లు ద్వారా భూముల విలువలు వాస్తవ మార్కెట్‌కు దగ్గరగా వస్తాయి. ఇది రియల్ ఎస్టేట్ లావాదేవీలలో పారదర్శకతను పెంచుతుంది. అలాగే.. ప్రభుత్వానికి కూడా గణనీయమైన రెవెన్యూ సమకూరుతుంది. ఈ సంస్కరణలు తెలంగాణలో మహిళల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కూడా బలం చేకూరుస్తాయి. ఇది దీర్ఘకాలికంగా సానుకూల ప్రభావాలను చూపుతుందని ఆశించవచ్చు.

# ట్రంప్‌కు మోదీ తలొగ్గుతారు..

వ్యాఖ్యానించారు. తన మాటలను రాసిపెట్టుకోవాలంటూ సవాల్ విసిరారు. మూడు నెలల క్రితం భారత్‌పై అమెరికా 26 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ సుంకాల సస్పెన్షన్ గడువు జులై 9తో ముగియనుండటంతో ఆలోగా ఓ వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకు ఇరు దేశాలు ప్రయత్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ విమర్శలపై కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ స్పందించారు. అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల విషయంలో భారత్ పటిష్ఠమైన విధానాలను అనుసరిస్తోందని స్పష్టం చేశారు. గడువులను చూసి కీలక ఒప్పందాలపై తొందరపడబోమని, ఇరు దేశాలకూ ప్రయోజనం చేకూరితేనే ముందుకెళ్తామని ఆయన తెలిపారు. ఈ ఒప్పందంలో భాగంగా వస్త్రాలు, ఆభరణాలు, రొయ్యలు, ప్లాస్టిక్స్ వంటి ఉత్పత్తులపై సుంకాల మినహాయింపును భారత్ కోరుతోంది. మరోవైపు ఎలక్ట్రిక్ వాహనాలు, పారిశ్రామిక వస్తువులు, పాడి ఉత్పత్తులపై సుంకాలు తగ్గించాలని అమెరికా డిమాండ్ చేస్తోంది. అయితే, పాడి, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలు తగ్గిస్తే దేశీయ రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయనే ఆందోళనల నేపథ్యంలో ఆ డిమాండ్లకు భారత్ అంగీకరించడం లేదు. ఇప్పటికే చర్చల నిమిత్తం అమెరికా వెళ్లిన భారత బృందం తిరిగిరావడంతో జులై 9లోగా ఓ మధ్యంతర ఒప్పందం కుదిరే అవకాశం ఉందని సమాచారం.

# టి.జి.ఆర్.టి.సి లో కొత్త నియామకాలు

**ఆకాంక్ష :** మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం టీజీఆర్టీసీకి జీవం పోసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ పథకంతో ఆర్టీసీ లాభాల బాట పడుతుందని.. ఇది మహిళా సాధికారతకు చిహ్నమని పేర్కొన్నారు. కాగా, పెరిగిన రద్దీకి అనుగుణంగా కొత్త బస్సుల కొనుగోలు, ఆర్టీసీ నియామకాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఆర్టీసీని మరింతగా అభివృద్ధి చేస్తామని మంత్రి పొన్నం వెల్లడించారు. తెలంగాణలో తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం (మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం) టీజీఆర్టీసీకి కొత్త జీవం పోసిందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం ప్రజా భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. మంత్రి సీతక్కతో కలిసి 151 మండల మహిళా సంఘాల గ్రూప్‌లకు (అద్దె బస్సుల యజమానులకు) రూ.1.05 కోట్ల చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం



మాట్లాడుతూ.. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ప్రారంభించిన తర్వాత రాష్ట్రంలోని మహిళలంతా ఎంతో సంతోషంగా ఉన్నారని అన్నారు. ఇది మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం వేస్తున్న కీలక అడుగు అని చెప్పారు. చేతి గుర్తుకు ఓటేసినందుకు మహిళలు చెయ్యెత్తితే చాలు ఆర్టీసీ బస్సు ఆపుతున్నారని అన్నారు. తాము సగౌరవంగా బస్సెక్కుతున్నామని మహిళలు చెబుతున్నారని పొన్నం గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించామని.. ఈ పథకం వల్ల ఆర్టీసీ మరోసారి బతికిందని పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే దాదాపు 200 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేసిన రికార్డు నమోదు కాబోతుందని తెలిపారు. ఇప్పటివరకు రూ.6500 కోట్ల విలువైన ఉచిత ప్రయాణం నమోదైందని, ఈ డబ్బులు ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించిందని స్పష్టం చేశారు. మహాలక్ష్మి పథకం విజయవంతం కావడం కోసం డ్రైవర్లు, కండక్టర్లు ఎంతో కష్టపడుతున్నారని వారి సేవలను కొనియాడారు. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ నష్టాల నుంచి లాభాల బాట పడుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్టీసీలో కొత్త బస్సులు కొనుగోలు చేస్తున్నామని.. కొత్త నియామకాలు చేపడుతున్నామని తెలిపారు. మహిళలు ఎక్కడికి వెళ్లాలన్నా ఆర్టీసీ ఉచిత బస్సులను వాడుకుంటున్నారని, ఇది ఆర్టీసీకి ఆదాయాన్ని పెంచుతుందని అన్నారు. ఈ అంశంపై తెలంగాణ వ్యాప్తంగా గ్రామ గ్రామాన సంబరాలు నిర్వహించాలని కాంగ్రెస్ శ్రేణులకు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ పథకం కేవలం ఉచిత ప్రయాణం మాత్రమే కాదని, మహిళల స్వేచ్ఛకు, ఆర్థిక భద్రతకు ఒక చిహ్నంగా మారిందని పేర్కొన్నారు.

# డ్వాక్రా మహిళలకు శుభవార్త.. ఈ నెల 10 నుంచి వడ్డీ లేని రుణాల చెక్కులు పంపిణీ..

**ఆకాంక్ష:** తెలంగాణ రాష్ట్రం మహిళా సాధికారతకు ఒక గొప్ప ఆదర్శంగా నిలవాలనే సంకల్పంతో ముందుకు సాగుతోంది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శనివారం ప్రజాభవన్‌లో జరిగిన ఇందిరా మహిళా శక్తి సంబరాల సందర్భంగా ఈ విషయాన్ని స్పష్టం చేశారు. మహిళా స్వయం సహాయక బృందాలకు (%ూ౧+%) టీఎస్‌ఆర్టీసీ నుంచి అద్దె చెక్కులు అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ, వారిని నిజమైన మహారాణులుగా గౌరవిస్తోందన్నారు. స్వయం సహాయక బృందాలు ఆర్థికంగా లాభాలు ఆర్జించి, వారి కుటుంబాలు స్థిరపడి, ఉన్నత స్థాయికి ఎదగాలనే ఆశయంతోనే ఈ ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందిస్తున్నామని వివరించారు. రాష్ట్ర విభజన తర్వాత దశాబ్ద కాలం పాలించిన గత ప్రభుత్వం (బీఆర్ఎస్) వడ్డీ లేని రుణాలు, మహిళా బృందాలకు ప్రోత్సాహకాలను నిర్లక్ష్యం చేసిందని ఉపముఖ్యమంత్రి విమర్శించారు. అయితే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరిగి వడ్డీ లేని రుణాలను పునరుద్ధరించి, మహిళా బృందాలను ప్రోత్సహిస్తూ, వారిచే ప్రత్యేక వ్యాపారాలు చేయిస్తోందని తెలిపారు. హైదరాబాద్ నగరంలో లక్షలాది మందితో సభలు నిర్వహించి ఇప్పటికే రెండుసార్లు వడ్డీ లేని రుణాల చెక్కులు పంపిణీ చేశామని గుర్తుచేసుకున్నారు. మరోసారి వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమాన్ని ఉత్సవంలా నిర్వహించాలని ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందని పేర్కొన్నారు. వడ్డీ లేని రుణాల ద్వారా లభించిన పెట్టుబడులను ఎలా సద్వినియోగం చేసుకోవాలి, ఏ వ్యాపారాలు చేపట్టాలనే అంశంపై ఈ నెల 7 నుంచి 9 వరకు జిల్లా, మండల, గ్రామ స్థాయిలలో మహిళా బృందాలు సమావేశమై చర్చించుకోవాలని ఉపముఖ్యమంత్రి సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ లేని రుణాల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని కూడా ఆయన పిలుపునిచ్చారు. మహిళా బృందాల ద్వారా బస్సులను కొనుగోలు చేయించి, వాటిని టీఎస్‌ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడం ద్వారా మొదటి దశలో కోటి రూపాయల అద్దెను నేడు అందించడం ఒక శుభ పరిణామమని ఉపముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో టీఎస్‌ఆర్టీసీ నుంచి మరింత పెద్ద ఎత్తున ఆదాయం మహిళా బృందాలకు అందుతుందని, త్వరలోనే ఆ వివరాలను వెల్లడిస్తామని హామీ ఇచ్చారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే ఆలోచనతో విద్యుత్ శాఖ మహిళా బృందాలతో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఒప్పందాలు చేసుకున్న విషయాన్ని ఉపముఖ్యమంత్రి వివరించారు. మహిళా బృందాల ద్వారా 1,000 మెగావాట్లకు తగ్గకుండా విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ఒప్పందాలు జరిగాయని తెలిపారు. రాష్ట్రంలో అవకాశం ఉన్న ప్రతిచోట క్యాంటీన్ల నిర్వహణ, పాఠశాలల మరమ్మతులు, విద్యార్థులకు స్కూల్ డ్రెస్సులు కుట్టడం వంటి పనులను కూడా మహిళా బృందాలకు అప్పగించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. మహిళా బృందాలు ఉత్పత్తి చేసిన వస్తువులను తిరిగి ప్రభుత్వమే కొనుగోలు చేసే ఆలోచనను కూడా రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన విధంగా రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని ఉపముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. అందులో భాగంగా మొదటి సంవత్సరంలోనే రూ.21,000 కోట్ల వడ్డీ లేని రుణాలను మహిళా బృందాలకు అందించామని, ప్రతి ఏటా రూ.20,000 కోట్లకు తగ్గకుండా వడ్డీ లేని రుణాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ నెల 10 నుంచి 16వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని శాసనసభ నియోజకవర్గాల్లో ప్రజల సమక్షంలో వడ్డీ లేని రుణాలకు సంబంధించిన చెక్కుల పంపిణీ కార్యక్రమం పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు ఉపముఖ్యమంత్రి తెలిపారు. కవలం వడ్డీ లేని రుణాలే కాకుండా, బ్యాంక్ లింకేజ్, లోన్ బీమా, ప్రమాద బీమా వంటి సౌకర్యాలను కూడా స్వయం సహాయక బృందాలకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోందని వివరించారు. ప్రజా ప్రభుత్వం మనందరిదీ అని, సమాజంలో కుటుంబ వ్యవస్థ ప్రధానమైనదని, ఆ వ్యవస్థను నడిపే మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తే రాష్ట్రం, ప్రజలు తలెత్తుకుని జీవించే పరిస్థితి ఏర్పడుతుందని భట్టి విక్రమార్క తన ప్రసంగాన్ని ముగించారు. ఇది తెలంగాణలో మహిళా సాధికారతకు ఒక కొత్త శకానికి నాంది పలకనుంది.

# కౌలు రైతులకు గుర్తింపు కార్డులు రెన్యూవల్ చేసుకోవాలి : ఏవో



**పెడన, ఆకాంక్ష :** గతంలో కౌలు గుర్తింపు కార్డులు కలిగిన రైతులు వీఆర్వోల ద్వారా రెన్యువల్ చేసుకోవాలని పెడన మండల వ్యవసాయ అధికారి సజ్జా జెన్నీ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అలాగే కొత్తగా దరఖాస్తులు చేసుకునే రైతులు రెవెన్యూ శాఖ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. తగిన పత్రాలను వీఆర్వోలకు అందజేస్తే కౌలు రైతు గుర్తింపు అర్హత కార్డులు మంజూరు అవుతాయన్నారు.

# తన పోరాటంతో మన్యం వీరుడు ప్రజలహృదయాల్లో నిలిచారు : ప్రత్తిపాటి



**చిలకలూరిపేట, ఆకాంక్ష :** పార్టీ శ్రేణులతో కలిసి అల్లూరికి ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకొని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం నివాళులు అర్పించారు. తన క్యాంప్ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి అల్లూరికి ఘన నివాళులు ప్రత్తిపాటి అర్పించాడు.ఆ వీరుడి ధైర్యసాహసాలను స్మరించుకున్నారు. మన్యం పులి అల్లూరి బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడి దేశం కోసం ప్రాణత్యాగం చేసి శాశ్వతంగా ప్రజల హృదయాల్లో నిలిచిపోయాడని ప్రత్తిపాటి కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ టీడీపీ కరీముల్లా, పఠాన్ సమాధ్ ఖాన్, మద్దుమలా రవి, తోట బ్రాహ్మస్వాములు, నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

# శ్రీ త్రికోటేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు



**నరసరావుపేట, ఆకాంక్ష :** దకోటప్పకొండ లో ఆలయ హుండీ లెక్కింపు గురువారం రోజు జరిగింది. మొత్తం ఆదాయం 82 లక్షల 5740 వచ్చింది. 28 గ్రాముల 500 బంగారం 580 రెండు గ్రాముల 500 మిల్లి గ్రాములు వెండి . మలేషియా సింగపూర్ బంగ్లాదేశ్ అమెరికన్ డాలర్ భక్తులు స్వామి వారికి సమర్పించారు.

# డిపో సెక్రెటరీ అద్దంకి వరప్రసాద్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్




**చిలకలూరిపేట,ఆకాంక్ష :** పట్టణంలోని బస్ డిపోలో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గేట్ మీటింగ్ జరిగింది. ఈ కార్యక్రమం డిపో సెక్రటరీ అద్దంకి వరప్రసాద్ ఆధ్వర్యంలో జరిగినది. అతను మాట్లాడుతూ ఆర్టీసీ సిబ్బందికి హెచ్ఆర్ఏ మిగిలిన అంశాలను ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బి కోటేశ్వరరావు. డిపో అధ్యక్షులు పి కృష్ణ డిపో సెక్రెటరీ అద్దంకి.వరప్రసాదరావు డిపో ట్రెజరర్ ఎస్ కే సైదావలి. వైస్ ప్రెసిడెంట్ ఏ థామస్ జాయింట్ సెక్రెటరీ ముప్పా సుబ్బారావు,సాయి జి రవిబాబు కేకే రావు సుబ్రహ్మణ్యం. లీల. నాగలక్ష్మి కమల పబ్లిసిటీ సెక్రటరీలో లక్ష్మి. అనంతరం వాసు. ఎం నాగేశ్వరరావు గ్యారేజ్ కార్యదర్శి శేషయ్య కోటి నాయక్ పురుషోత్తపట్నం సుభాని. పెయింటర్ ఆంజనేయులు ఎమ్మెస్ నాయక్ వి.ఎస్ నాయక్. యూనియన్ సభ్యులు పాల్గొన్నారు

# కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కి ఘన సన్మానం




**మచిలీపట్నం, ఆకాంక్ష:** ఐఏఎస్ గా( ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్) నిన్నటి రోజు శుక్రవారానికి 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జడ్పీ డిప్యూటీ సీఈఓ ఆనంద్ కుమార్ నేతృత్వంలో జిల్లా యంత్రాంగం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా పలువురు అధికారులు జిల్లా కలెక్టర్ ఐఏఎస్ గా పదవీ బాధ్యతలు చేపట్టిననాటి నుండి ఇప్పటివరకు పేద ప్రజల పట్ల చూపుతున్న దయాగుణం, వారికి సహాయం చేయాలన్న తపన, మానవత్వం, ఏ అంశంలో అయినా ఉద్యోగులు సులభంగా ఎలా విధులు నిర్వహించాలో విశదీకరణ, బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని విద్యార్థులకు ఇచ్చే ప్రేరణ, ఉపాధ్యాయులకే ఉపాధ్యాయులుగా శిక్షణ ఇచ్చిన తీరును ప్రస్తావిస్తూ జిల్లా కలెక్టర్ ను అభినందించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఐఏఎస్ గా చేసిన ప్రజా సేవల పై రూపొందించిన ఏ.వి.ప్రదర్శించారు. అధికారులు పెద్ద ఎత్తున గజ పూలమాల, పూల కిరీటం శాలువలు, పుష్పగుచ్చాలు, జ్ఞాపికలతో జిల్లా కలెక్టర్ ను ఘనంగా సత్కరించారు. అందరూ జిల్లా కలెక్టర్ చేత కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ డాక్టర్ జే అరుణ, డి ఆర్ డి ఏ పిడి హరిహరనాథ్, గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి వెంకటరావు, డీఎంహెచ్వో డాక్టర్ శర్మిష్ఠ , డిఐసి జిఎం ఆర్ వెంకటరావు, పౌరసరఫరాల సంస్థ డీఎం శివరాం ప్రసాద్, ఉపాధి కల్పనాధికారి విక్టర్ బాబు, పలువురు ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, గృహ నిర్మాణ సంస్థ ఇంజనీర్లు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి సమావేశాలలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని కి అరుదైన గౌరవం

**స్థానిక సంస్థల బలోపేతం అంశం పై జాతీయ స్థాయి సమావేశాలలో మాట్లాడుతున్న : చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ రఫాని**



**చిలకలూరిపేట, ఆకాంక్ష :** హర్యానాలోని, గురుగ్రామ్ లో భారత పార్లమెంటు హర్యానా ప్రభుత్వ సహకారంతో దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పట్టణ స్థానిక సంస్థల చైర్మన్ లతో"రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, దేశ నిర్మాణంలో పట్టణ స్థానిక సంస్థల పాత్ర" అంశంపై అవగాహన కల్పించడం కోసం జరుగుతున్న రెండు రోజుల జాతీయ స్థాయి సమావేశాలలో మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు పత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు ఆ సమావేశాలలో పాల్గొన్న చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని కి అరుదైన గౌరవం దక్కింది ఈ సమావేశాలలో స్థానిక సంస్థల బలోపేతం అంశం పై ఆయనకు మాట్లాడేందుకు హర్యానా ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ స్థాయి వేదిక అవకాశం కల్పించింది. ఈ సందర్భంగా చైర్మన్ రఫాని మాట్లాడుతూ పట్టణ గ్రామ పంచాయతీలు మౌలిక వసతులు సదుపాయాల కల్పనలో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు చేసిన తీర్మానాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అత్యధిక ప్రాధాన్యతను ఇచ్చి త్వరితగతిన పరిష్కార మార్గాలు చూపేందుకు చొరవ చూపాలని.. ముఖ్యంగా ప్రజా ప్రయోజనార్థం చేసే తీర్మానాలను 2,3,సంవత్సరాలు కాలయాపన కాకుండా ప్రతి ఏటా పెట్టే వార్షిక బడ్జెట్ ప్రవేశ పెట్టే నాటికి నిర్ణయాలు ఆయా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్నట్లయితే స్థానిక సంస్థల బలోపేతం మార్గం సుగమం అవుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. అంతే కాకుండా పట్టణాలు,మేజర్ పంచాయతీలు, వేగంగా అభివృధి చెందాలంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా.ఉపాధి పారిశ్రామికరుణ కల్పనకు .పట్టణ ప్రణాళిక విభాగాలు , కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యాలకు తగినట్లుగా పని తీరు లేదని ,స్థానిక సంస్థల ప్రతీ నిధుల సూచికలను ఏ మాత్రం పాటించని విధముగా పట్టణ ప్రణాళిక విభాగాలు ఉంటున్నాయని. పట్టణ ప్రణాళిక విభాగాలు విధులు నిర్వహణ విధానాలను పున సమీక్ష చేయాలని అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిపారు. అనంతరం చిలకలూరిపేట మున్సిపాలిటీ సంబంధించిన పలు అంశాలను. ఫైల్ రూపంలో కేంద్ర మంత్రులకు అందజేసినట్లు తెలిపారు.

# నిర్ణీత లక్ష్యాలను సాధించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలి:జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



**మచిలీపట్నం, ఆకాంక్ష :** జిల్లాలో గృహ నిర్మాణం చాలా వెనుకబడి ఉందని నిర్ణీత లక్ష్యాలను సాధించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గృహ నిర్మాణం, స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్, పి 4 కార్యక్రమాలపై క్షేత్రాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 10,007 ఇళ్ల నిర్మాణం జరగాల్సి ఉండగా ఇప్పటివరకు 3,603 ఇల్లు పూర్తయ్యాయన్నారు.గత జూన్ నెలలో సమావేశం జరిగినప్పుడు 2,558 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యం కాగా కేవలం 179 ఇల్లు నిర్మాణం మాత్రమే పూర్తి చేశారన్నారు. గత సమావేశం నుండి ఇప్పటివరకు పైకప్పు స్థాయి నుండి రూఫ్ క్యాస్టింగ్ వరకు కేవలం 148 ఇల్లు మాత్రమే వచ్చాయన్నారు. గృహ నిర్మాణంలో సరైన పురోగతి కనిపించడం లేదని ఇకనైనా ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత లక్ష్యాల మేరకు వచ్చే సమావేశం ఈనెల 19వ తేదీ నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఇళ్ల లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయం గురించి అవగాహన కలిగించి ఇళ్ల నిర్మాణం పురోగతిని సాధించాలన్నారు. జిల్లా మొత్తం లక్ష్యాలను ఈ ఏడాది డిసెంబర్ నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. కష్టపడి పనిచేసి ఇళ్ల నిర్మాణ పనుల బిల్లులు వెంటనే అప్లోడ్ చేయాలని ముందస్తుగా ఎవరికి బిల్లుల చెల్లింపు చేయరాదన్నారు.స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ కార్యక్రమం పై ఇదివరకు సమావేశం నిర్వహించి స్పష్టంగా వివరించినప్పటికీ తాను గ్రామాల్లో పర్యటించినప్పుడు కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం గమనించామన్నారు. గ్రామాల్లో చెక్లిస్ట్ ప్రకారం గమనించుకొని వసతులు ఏర్పాటు చేయడంలో సరైన శ్రద్ధ చూప లేదన్నారు ముఖ్యంగా అంగన్వాడి కేంద్రాలు, ప్రార్థన మందిరాల వద్ద ఇంకుడు గుంతలు ఉపాధి హామీ పథకం కింద చేపట్టాలని చెప్పినప్పటికీ ఆ పనులు చేయలేదన్నారు. అంతేకాకుండా ప్రతి ఇంటికి ఒక వ్యక్తిగత మరుగుదొడ్డి తప్పనిసరిగా ఉండాలని, లేనివారికి స్వచ్ఛభారత్ మిషన్ కింద కొత్తగా మరుగుదొడ్డి మంజూరు చేయడంతో పాటు దాని నిర్మాణం పూర్తి చేసేందుకు కూడా చొరవ చూపాలన్నారు.మరలా కేంద్ర బృందం ఈనెల 7 వ తేదీన జిల్లాకు వచ్చే అవకాశం ఉందని ఆలోగా గుర్తించిన 54 గ్రామాల్లో వెంటనే మరుగుదొడ్లు ఇంకుడు గుంతలు తదితర కనీస మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి వివరాలు పంపాలన్నారు పి 4 కార్యక్రమంలో ప్రతి ఎంపీడీవో సభ్యులుగా ఉన్నారన్నారు.గ్రామాల్లో కొన్ని ట్రస్టులు సొసైటీలు ఉంటున్నాయని వాటిని గుర్తించి వారిని మార్గదర్శిగా పేదవారిని ఆదుకునే దిశగా అనుసంధానం చేయాలన్నారు. వచ్చే ఆగస్టు నెల 15వ తేదీ నాటికి మార్గదర్శి బంగారు కుటుంబాల విజయ గాథలతో ఒక పుస్తకం విడుదల చేయాలని సంకల్పించామన్నారు. అందుకు తగ్గట్టుగా అధికారులందరూ ప్రత్యేక శ్రద్ధ వహించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి వెంకటరావు, జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనంద్ కుమార్, డిపిఓ అరుణ మండల ప్రత్యేక అధికారులు ఎంపీడీవోలు మున్సిపల్ కమిషనర్లు గృహ నిర్మాణ సంస్థ ఇంజనీర్లు పాల్గొన్నారు.



# బంగారు కుటుంబాల అనుసంధానం చేసే ప్రక్రియ పూర్తి చేసేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలి:జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ





**మచిలీపట్నం, ఆకాంక్ష :** జిల్లాలో వచ్చే ఆగస్టు 15 వ తేదీ లోగా పి -4 కార్యక్రమం కింద మార్గదర్శిలతో బంగారు కుటుంబాల అనుసంధానం చేసే ప్రక్రియ పూర్తి చేసేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ మీకోసం సమావేశం మందిరంలో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి పి 4, స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమాలపై జిల్లా అధికారులు, వివిధ వర్గాల సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పి 4, స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. జిల్లాలో 67 వేల కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించామన్నారు. జీవితంలో ఉన్నతంగా స్థిరపడిన ధనికులను గుర్తించి మార్గదర్శిలను ఎంపిక చేయాలన్నారు. వారిని బంగారు కుటుంబాలతో ఆన్లైన్లో అనుసంధానం చేసి దత్తత తీసుకునేలా చొరవ చూపాలన్నారు.బంగారు కుటుంబాలుగా గుర్తించిన వారిలో ఎవరికైనా ఆర్థిక సహాయం చేయడం, ఏదో రకమైన చేయూత అందించడం, పిల్లలకు చదువుకు అయ్యే ఖర్చు భరించడంగాని, జీవనోపాదులు కల్పించడం గాని లేదా ఏదైనా ఆరోగ్య సమస్యలు ఉంటే ఆర్థిక సహాయం అందించి ఆదుకోవడం గాని లేదా వాళ్లకు అవసరమైన ఏదేని అంశంలో సలహాలు ఇచ్చి సరైన మార్గ నిర్దేశం చేయడం గాని చేయవచ్చన్నారు.జిల్లా అధికారులందరూ మొదట ఈ పి 4 కార్యక్రమం పై నమ్మకం ఉంచి ఆదివారం నుండే పని ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామస్థాయి నుండి మొదలుపెట్టాలని ముఖ్యంగా ప్రతి గ్రామ, వార్డు సచివాలయాన్ని ఒక యూనిట్ గా తీసుకొని అందులోని సిబ్బంది అందరూ చురుకుగా గ్రామాల్లో తిరిగి ముఖ్యంగా అక్కడి పాఠశాలల్లో చదివి ఉన్నత స్థాయికి చేరుకున్న పూర్వ విద్యార్థులను మార్గదర్శిలుగా గుర్తించాలన్నారు. రైస్ మిల్లర్,డాక్టర్లు, ఆసుపత్రులు, ఇమిటేషన్ జ్యువలరీ సంఘాలు, రోటరీ, లైన్స్ క్లబ్ వారి పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు గాని వారి చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లో పేద ప్రజలకు గాని ఏదైనా సహాయం చేసేందుకు ముందుకు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు.ఆయా సంఘాల సభ్యుల జాబితాను నియోజకవర్గాలు, మండలాల ప్రత్యేక అధికారులు తీసుకొని వారితో మాట్లాడి మార్గదర్శిలుగా ఉండేందుకు ప్రయత్నించాలన్నారు. కనీసం నియోజకవర్గానికి 5,000 మంది చొప్పున బంగారు కుటుంబాలను కార్యదర్శిలతో అనుసంధానం చేయాలన్నారు. అలాగే గుడ్లవల్లేరు, వాసవి, సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలల్లో పూర్వ విద్యార్థుల జాబితా తీసుకొని వారిలో మంచి స్థితి మంతులుగా ఉన్న వారితో బంగారు కుటుంబాలను అనుసంధానం చేయాలని ముఖ్యంగా అదే కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు దత్తత తీసుకునేలా చొరవ చూపాలన్నారు. అంతేకాకుండా చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లో పేద విద్యార్థులను కూడా చదివించేందుకు వారు అంగీకరించేలా కృషి చేయాలన్నారు. అలాగే పెట్రోల్ బంకు, ఆక్వా , కలంకారి వ్యాపారస్తులు, సూర్యఘర్ కంపెనీలు, పారిశ్రామికవేత్తలను కూడా సంప్రదించి మార్గదర్శిలుగా ఉండేందుకు చొరవ చూపాలన్నారు.ఈ సమావేశంలో డ్వామా, డి ఆర్ డి ఏ, మెప్మా, ఐ సి డి ఎస్ పిడీలు శివ ప్రసాద్, హరిహరనాథ్ , సాయిబాబు,ఎం ఎన్ రాణి, జిల్లా పశు సంవర్ధక అధికారి చిన్న నరసింహులు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శివరాం ప్రసాద్ ,డి ఎం హెచ్ ఓ డాక్టర్ శర్మిష్ఠ , ఉద్యాన అధికారి జ్యోతి, సిపిఓ భీమరాజు, మార్కెటింగ్ ఏడి నిత్యానందం, మార్క్ఫెడ్ డి ఎం మురళీకృష్ణ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# నల్గొండ జిల్లాలో తల్లి ప్రేమకు మరో రూపం.



**నల్గొండ జిల్లా(ఆకాంక్ష న్యూస్) :** ఇది ఓ తల్లికి మాత్రమే సాధ్యమయ్యే త్యాగం...ఇది ఓ మమతామయురాలే చేసే పనికాదు %–% ఒక అచంచలమైన ప్రేమకు ప్రతిరూపం.తాను చనిపోయిన తర్వాత కూడా పిల్లలకు కష్టపెట్టొద్దని ఆలోచించి ముందే డబ్బులు దాచుకున్న తల్లి%ˆ%చివరలో చనిపోయే ముందు "ఇవి నా చావు ఖర్చు" అంటూ చూపించి కన్నుమూసింది.ఆమె పేరు లక్ష్మమ్మ%ˆ% వయస్సు సుమారు 75 ఏళ్లు. ఈ సంఘటన నల్గొండ జిల్లాలోని నార్కెట్‌పల్లి మండలంలోని మాంద్ర గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... చిన్నప్పటి నుంచి లక్ష్మమ్మ జీవితం అంతా కష్టాలతో నిండి ఉంది.చిన్ననాటి నుంచే ఉపాధి కోసం పోరాడిన ఆమె%ˆ% పెద్దయ్యాక వ్యవసాయ కూలిగా, ఇళ్లలో పని మనిషిగా పని చేసింది.తన భర్త మరణించిన తర్వాత చిన్నపిల్లల్ని పెంచడం ఆమె బాధ్యత అయింది.పిల్లలకి చదువు చెప్పాలని ఎన్నో త్యాగాలు చేసింది.తన ఆరోగ్యం కోల్పోయినా, పిల్లల భవిష్యత్తు కోసమే బతికింది.అయితే తన చావుకు తానే సిద్ధమైంది...గత కొంతకాలంగా లక్ష్మమ్మ అనారోగ్యంతో బాధపడుతోంది.వయసు మీద పడిన ఆమెకు నడవడం, పనులు చేయడం కష్టమయ్యే స్థితికి వచ్చింది. అయినా కూడా తన సొంత అవసరాలకు ఎవరినీ అడగకుండా, పెన్షన్ వచ్చిన ప్రతిసారి కొంత డబ్బు దాచుకుంటూ వచ్చింది.తాను చనిపోయినప్పుడు కుమారుడికి భారం కాకూడదని తలచిన ఆమె%ˆ%తన దిండులో ఆ డబ్బులను చక్కగా పెట్టుకుంది.తన కుమారుడితో చివరిసారిగా మాట్లాడిన సమయంలో,నన్ను అంతిమ యాత్రకు పంపించడానికి ఇవి సరిపోతాయి...రా బాబు" అంటూ తన దిండు చూపించిన ఆమె%ˆ%కన్నీటి లోకంలోకి వెళ్లిపోయింది. అయితే ఈ వేధన అక్కడే ఆగలేదు%ˆ% ఆమె కుమారుడు దిండులోని డబ్బు తీసి చూసాడు.అందులో పాత రూ.500, రూ.1000 నోట్లు ఎక్కువగా ఉన్నాయి.నోట్ల రద్దు జరిగినప్పటికీ లక్ష్మమ్మకు ఈ విషయం తెలియలేదు. ఆమె దాచిన డబ్బులు చెలామణి అవ్వని నోట్లు కావడం కుటుంబాన్ని మరింత బాధకు గురిచేసింది.తల్లి తాను మిగిలి పోవడానికి కాదు, వెళ్లిపోవడానికి డబ్బు దాచింది%ˆ% కానీ ఆ డబ్బు ఆమెకే పనికిరాలేదు" అనే ఆవేదన కుటుంబ సభ్యులంతటినీ కమ్మేసింది. ఈ ఘటన పలువురిని కన్నీటి పర్యంతం చేసింది.

### గ్రామస్తుల గుండెల్ని తడిపిన సంఘటన....

ఈ సంఘటన తెలిసిన ప్రతి ఒక్కరూ కన్నీటి పర్యంతమవుతున్నారు.ఆమె త్యాగానికి, ప్రేమకు జోహార్లు చెబుతున్నారు.గ్రామస్తులు, చుట్టు పక్కలవారు ఆమె అంత్యక్రియలు నిర్వహించేందుకు ముందుకు వచ్చారు. తమ జీవితాల్లో ఇలాంటి తల్లి ప్రేమను ఎప్పటికీ మర్చిపోలేమని పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

### సామాజిక మాధ్యమాల్లో స్పందన....

ఈ సంఘటన సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.ఇది తల్లి ప్రేమ అంటే ఏమిటో చూపించే ఉదాహరణ" అని తన మరణానికి తానే ఖర్చును భరించుకోవాలనుకుంది.ఇది తల్లి గొప్పతనం"నోట్ల రద్దు విషయం ఆమెకు తెలియకపోవడం బాధాకరం" అంటూ పోస్టులు వస్తున్నాయి. దీంతో పలు సంస్థలు లక్ష్మమ్మ త్యాగాన్ని గుర్తిస్తూ గ్రామంలో ఆమెకు జ్ఞాపికగా ఓ బస్టాండ్, చెక్కిలేని నామఫలకం ఏర్పాటు చేయాలంటూ ప్రజలు కోరుతున్నారు.

### ఇది మన సమాజానికి హెచ్చరిక కూడా...

ఈ సంఘటన మనకెందుకు కావాలి అంటే...పెద్దవారిని పట్టించుకోవడంలో మనం ఎంత తక్కువగా ఉన్నామో గుర్తించడానికి నిదర్శనంగా చెబుతుంది. వారికి మనం చేయాల్సిన విషయాలను అంత సాధారణమైన నోట్ల రద్దును కూడా చేరవేయలేకపోయిన మన తప్పు ఇది.ఒక్కసారి ఆమెకు వివరించి ఉండి ఉంటే, ఆమె చివరి కోరిక అసంతృప్తిగా ఉండేది కాదు.తల్లి అనగానే ఆప్యాయత గుర్తుకొస్తుంది.కానీ "తానొస్తున్న మృత్యువునూ ముందే అంచనా వేసి, దానికి ఖర్చును కూడా సిద్ధం చేసుకుని, తన కుటుంబాన్ని కష్టపెట్టకూడదని తలచిన తల్లి" %–% ఇది ఆప్యాయత కాదు, త్యాగంలో తుది మెట్టు అని పలువురు కొనియాడుతున్నారు.నల్గొండ జిల్లా మాంద్ర గ్రామానికి చెందిన లక్ష్మమ్మ లాంటి తల్లుల వల్లే ఈ సమాజం మానవతను ఇంకా నిలుపుకోవగలుగుతోందని పలువురు మేధావులు భావిస్తున్నారు.

# ప్రభుత్వ ఉద్యోగం రాలేదని ప్రాణం తీసుకున్న యువతీ

**హన్మకొండ (ఆకాంక్ష న్యూస్) :** పెద్దకోడెపాక గ్రామంలో విషాద సంఘటన చోటుచేసుకుంది. ప్రభుత్వ ఉద్యోగం రాకపోవడం వల్ల తీవ్ర మనోవేదనకు గురైన ఒక యువతి తాను వేసిన ఆశలన్నిటికి స్వయంగా తెరదించింది. వివరాల్లోకి వెళ్తే..గ్రామానికి చెందిన రావుల ప్రత్యూష (24) బీటెక్ పూర్తి చేసిన తరువాత గత రెండేళ్లుగా ప్రభుత్వ ఉద్యోగం కోసం శ్రమిస్తూ వస్తోంది. ఎన్నో ఆశలతో, ఎంతో మనస్సు పెట్టి చదువుకున్న ప్రత్యూష, పలు ఉద్యోగాలకు ఎంట్రన్స్ పరీక్షలు కూడా రాసింది. అయితే, తక్కువ మార్కుల తేడాతో తాను అర్హత సాధించలేకపోయిందన్న విషయమై తీవ్రంగా నిరాశచెందింది.తాజాగా కూడా వచ్చిన ఫలితాల్లో తాను ఎంపిక కాలేదన్న విషయం తెలుసుకున్న ఆమె తీవ్ర మానసిక ఒత్తిడికి లోనైంది. శుక్రవారం నాడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్రత్యూష చున్నీతో పూరింటి దూలానికి ఉరేసుకుంది. కొద్దిసేపటికే ఆమె అమ్మమ్మ లక్ష్మి ఇంట్లోకి వెళ్లి చూసేసరికి ఈ దారుణం తెలిసి బోరున విలపించింది.ఆమె కేకలు విన్న చుట్టుపక్కలవారు అక్కడికి చేరుకుని పరిస్థితిని చూశారు. అప్పటికే ప్రత్యూష మరణించిందని తెలుసుకుని స్థానికులు తీవ్రంగా విచారం వ్యక్తం చేశారు. వెంటనే సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ప్రత్యూష మృతికి కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు నెలకొన్నాయి. పలువురు యువతులు, విద్యార్థులు, గ్రామస్థులు ప్రత్యూష మరణం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ %–% ఆమె ఆత్మహత్యకు కారణమైన పరిస్థితులు మారాలని కోరుతున్నారు.

### సామాజికంగా ఉధృతమవుతున్న ఒత్తిడిపై చర్చ....

ఇటువంటి సంఘటనలు నిత్యం వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో, యువతపై ఉన్న ఉద్యోగ ఒత్తిడి, నిరుద్యోగ భయం వంటి అంశాలపై ప్రభుత్వాలు, సమాజం సీరియస్‌గా ఆలోచించాల్సిన అవసరం ఉందని మానసిక నిపుణులు సూచిస్తున్నారు. లక్షలాది మంది యువత ఉద్యోగాల కోసం పోరాడుతున్న ఈ సమయంలో, నైతికంగా బలాన్ని కలిగించే మార్గాలను ప్రభుత్వం, కుటుంబ సభ్యులు అందించాల్సిన బాధ్యత మరింత పెరిగిందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.ప్రత్యూష మరణం గ్రామస్తులకు, తల్లిదండ్రులకు, స్నేహితులకు తీరని లోటుగా మిగిలింది.

# కమ్యూనిస్టులను అంతం చేయడం ఎవ్వరితరం కాదు

## అమిత్ షాకు సవాలు విసిరిన కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు....

## మహబూబాబాద్ జిల్లా కురవిలో సీపీఐ బహిరంగ సభ...

**మహబూబాబాద్(ఆకాంక్ష న్యూస్) :** కమ్యూనిస్టులను ఎవరూ అంతం చేయలేరని, ప్రజా పోరాటాల కంటిని ఎవరూ ఆపలేరని సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలో జరిగిన సీపీఐ మహాసభల సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు.కమ్యూనిస్టులను అడాల్ఫ్ హిట్లర్ సైతం అంతం చేయలేకపోయారు. అమిత్ షా నీ వల్ల అవుతుందా?" అని ఘాటుగా ప్రశ్నించారు. 'ఆపరేషన్ కగార్' పేరిట అడవుల్లో కమ్యూనిస్టులను అంతమొందించే ప్రయత్నంలో భాగంగానే నంబాల కేశవరావును హత్య చేశారని ఆరోపించారు.కేశవరావును చంపితే కోటి మంది కమ్యూనిస్టులు పుడతారని, అధికారంలో ఉన్నా లేకున్నా




కమ్యూనిస్టులు పేదల పక్షాన పోరాడుతూనే ఉంటారని అన్నారు. పదవుల కోసం కాదు, ప్రజల హక్కుల కోసం సీపీఐ పోరాడుతుందని వివరించారు. ప్రజల నష్టానికి పాల్పడితే కాంగ్రెస్ కూడా ఇదే పరిస్థితిని ఎదుర్కొంటుందని విమర్శించారు. డిసెంబర్ 26న ఖమ్మంలో సీపీఐ వందేళ్ల ఉత్సవాలను దేశవ్యాప్త కమ్యూనిస్టులతో కలిసి ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మావోయిస్టులు, సీపీఎం, న్యూడెమోక్రసీ, ఎర్రజెండా పట్టిన వారంతా ఒక్కటేనని అన్నారు. 1951 వరకు సాయుధ పోరాటం చేసిన సీపీఐ పరిస్థితులకు అనుగుణంగా ఆయుధాలు త్యజించిందని గుర్తు చేశారు. అన్ని ఎర్రజెండా పార్టీలు ఒక్కటిగా ఉండాల్సిన అవసరం ఉందని, ఎర్రకోటపై ఎర్రజెండా ఎగరాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

### ప్రజాపోరాటాలకు సిద్ధంగా ఉంటాం: తక్కెళ్లపల్లి...

ఈ సభలో మాట్లాడుతూ సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, "ఎన్నికల వరకే పొత్తులుంటాయి. ప్రజలను విస్మరించిన ప్రభుత్వాలకు ప్రజల చేతిలో తగిన బుద్ధి చెప్తారు," అని హెచ్చరించారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ కోసం మరో ఉద్యమానికి సిద్ధమవుతున్నామని తెలిపారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐకి మద్దతు తెలపాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా అభివృద్ధిని విస్మరిస్తే భవిష్యత్తులో అనర్థాలు తప్పవని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# స్నేహానికి అర్థం చెప్తూ మిత్రబృందం ఉదాత్త హృదయం....

**జయశంకర్ భూపాలపల్లి(ఆకాంక్ష న్యూస్) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కైలాపూర్ గ్రామానికి చెందిన సకినాల కుమారస్వామి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషాద ఘటన అతని స్నేహితుల గుండెలను కలిచేసింది. తమ మిత్రుడి కుటుంబాన్ని ఆదుకోవాలని భావించిన మిత్ర బృందం అందరూ కలిసి చందాలు వేసి సుమారు రూ.40,000 విలువైన ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు.ఈ సహాయాన్ని దశ దిన కర్మ సందర్భంగా కుటుంబ సభ్యులకు అందించగా, కుటుంబం తరఫున వారు కన్నీటి కంటుతో మిత్రబృందానికి కృతజ్ఞతలు తెలిపారు.స్నేహితుల ప్రేమకు నిదర్శనంగా నిలిచిన ఈ చర్య స్థానికంగా ప్రశంసలు పొందుతోంది. "జీవితంలో మేమున్నాం అని పలువురు అంటారు, కానీ ఆచరణలో చూపించేవారే నిజమైన స్నేహితులు" అని పలువురు మిత్రులు వ్యాఖ్యానించారు.ఈ కార్యక్రమంలో మిత్రబృందానికి చెందిన రాపెల్లి రాజు, చింతల శివ, మురళీకృష్ణ, మార్క చంద్రశేఖర్, మనోహర్, తిరుపతి, ఉదయ్ కిరణ్, రంజిత్, నరేందర్, రాజేందర్, పవన్, భార్గవ్, అరవింద్, శేఖర్, సూర్యం, వినయ్, నరేష్, నరేష్ (వెలిశాల), నవీన్, ప్రభాకర్, శ్రావణ్, మార్కండేయం, సురేష్, కరుణ, రామ్ చరణ్, అభిరామ్, నవీన్, స్వామి, శివ, సతీష్, రవి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



సామాజిక బాధ్యతకు ప్రతిరూపంగా నిలిచిన ఈ సంఘటన, సమాజానికి ఒక మంచి సందేశాన్ని అందించింది.

# ములుగు జిల్లా వెంకటాపురం అడవుల్లో పేలిన ప్రెషర్‌బాంబు

**ములుగు జిల్లా(ఆకాంక్ష న్యూస్) :** మావోయిస్టుల ఉగ్రకావ్యత.. పోలీసులు లక్ష్యంగా పెట్టిన బాంబు సామాన్యుడి ప్రాణాలపై ముప్పుగా మారింది. ములుగు జిల్లా వెంకటాపురం మండల పరిధిలోని కర్రెగుట్టల అడవుల్లో ఘోర ఘటన చోటుచేసుకుంది. పోలీసులను లక్ష్యంగా మావోయిస్టులు అమర్చిన ప్రెషర్ బాంబు కదలికలకే స్పందించి పేలింది. ఈ బాంబు పేలుడులో కామయ్య అనే స్థానిక యువకుడి ఎడమ కాలు నుజ్జునుజ్జయింది.వివరాల ప్రకారం, కామయ్య అనే యువకుడు అడవిలో వెదురు కోసేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తూ ప్రెషర్‌బాంబుపై కాలు వేసాడు. ఒక్కసారిగా శబ్దంతో బాంబు పేలడంతో అక్కడికక్కడే అతడి కాలు తీవ్రంగా దెబ్బతింది. రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న అతన్ని స్థానికులు సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం కామయ్య ఆరోగ్యం విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. పోలీసుల వివరణ ప్రకారం, ఈ ప్రాంతంలో మావోయిస్టుల సంచారం ఉన్న నేపథ్యంలో వారు అమర్చిన బాంబే ఇదని, బలగాలను లక్ష్యంగా పెట్టుకున్నా అది ఆ పాదచారిపై విరుచుకుపడిందని చెప్పారు. ఘటనాస్థలాన్ని పోలీసులు సీజ్ చేసి మరిన్ని బాంబులు లేదా ఉగ్రవస్తువులున్నాయేమో అనేది పరిశీలిస్తున్నారు. ఎక్స్‌ప్లోసివ్ స్క్వాడ్ కూడా రంగంలోకి దిగింది.ఈ ఘటన అనంతరం వెంకటాపురం మండల పరిధిలో భయాందోళనలు చోటుచేసుకున్నాయి. ప్రజలు అడవిలోకి వెళ్లేందుకు భయపడుతున్నారు. పోలీసులు నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు ప్రారంభించారు.

# కోటపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు....



**మంచిర్యాల(ఆకాంక్ష న్యూస్) :** మంచిర్యాల జిల్లా కోటపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఈరోజు దాడులు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ నవీన్ అనే అధికారి రైతు నుంచి పట్టు (పాస్‌బుక్) పనికి రూ.10,000 లంచం తీసుకుంటుండగా అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.లంచం డబ్బును కెమికల్ పరిక్షకు లోను చేయగా అవి అవినీతి డబ్బులేనని నిర్ధారణ అయింది. వెంటనే నవీన్‌ను అదుపులోకి తీసుకొని పైసీ అధినియమం (%ˆాజ ˆాష్% 1988) కింద కేసు నమోదు చేశారు. సంబంధిత అధికారుల సమక్షంలో కార్యాలయంలోని పలు పత్రాలు, కంప్యూటర్లను పరిశీలించారు. ఈ దాడితో స్థానికంగా చర్చకు దారి తీసింది. ప్రస్తుతం ఏసీబీ అధికారులు దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

# జగిత్యాల జిల్లాలో బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య



**జగిత్యాల(ఆకాంక్ష న్యూస్) :** జాగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామానికి చెందిన కాటిపెల్లి నిత్య (21) అనే యువతి ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి హెచ్‌ఎఫ్సీ కాలనీలో ఉన్న ఓ ప్రైవేట్ హాస్టల్లో ఉండి, ఆమె బీటెక్ 3వ సంవత్సరం చదువుతోంది.ఇటీవలి రోజుల్లో నిత్యను అదే హాస్టల్‌లో ఉండే స్నేహితులు వైష్ణవి, సంజన ు "నీ చదువు మందగించింది", "పాతాళానికి పోతున్నావ్" అంటూ పదేపదే అవమానిస్తూ మాట్లాడినట్టు సమాచారం. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన నిత్య, జూలై 2న స్వగ్రామానికి వెళ్లిన తరువాత గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది.తక్షణమే కుటుంబసభ్యులు ఆమెను ఆసుపత్రికి తరలించినప్పటికీ, చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం నిత్య మృతిచెందింది. ఈ విషాద ఘటనపై నిత్య తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, నిందితులుగా పేర్కొన్న వైష్ణవి, సంజనలపై కేసు నమోదు చేసినట్లు జగిత్యాల రూరల్ ఎస్ఐ సదాకర్ తెలిపారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విద్యార్థులు ఎదుగుతున్న వయస్సులో తమ మాటలు, ప్రవర్తన ఎంతటి ప్రభావం చూపించగలవో ఈ ఘటన మరోసారి గుర్తుచేసింది.

# ఏకలవ్య జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించిన ఎరుకల ప్రజా సమితి....



**గోదావరిఖని(ఆకాంక్ష న్యూస్) :** తెలంగాణ ఎరుకల ప్రజా సమితి రామగుండం నియోజకవర్గం ఆధ్వర్యంలో ఈరోజు (జులై 5) గోదావరిఖని చౌరస్తాలో ఏకలవ్య జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు కెమసారం తిరుపతి ముఖ్య అతిథిగా హాజరై, ఏకలవ్య చిత్రపటానికి పూలమాల వేసి, కేక్ కట్ చేసి, బహుమతుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కెమసారం తిరుపతి మాట్లాడుతూ, జూలై 1 నుండి 6వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ఏకలవ్య జయంతి ఉత్సవాలు నిర్వహించాలని తెలంగాణ ఎరుకల ప్రజా సమితి నిర్ణయించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ క్రమంలో గోదావరిఖనిలో జరిగిన ఈ ఉత్సవం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలోనే గొప్ప గురుభక్తుడిగా పేరుగాంచిన ఏకలవ్యుడు శిష్య బంధానికి నిలువెత్తు నిదర్శనమని చెబుతూ, ఎరుకల జాతి కులస్తులు ప్రతీ సంవత్సరం తొలి ఏకాదశి రోజున ఏకలవ్య జయంతిని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో నివసిస్తున్న ఆరు లక్షల ఎరుకల ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జయంతి నిర్వహించాలని, ఏకలవ్య విగ్రహాల కోసం స్థలాలు కేటాయించి స్థిర స్మారక చిహ్నాలు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మానుపాటి శ్రీనివాస్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు రెవెల్లి తిరుపతి, నడిగడ్డ కుమారస్వామి, రాష్ట్ర నాయకులు కోనేటి పోచయ్య, ఇతర సమితి నాయకులు పాల్గొన్నారు.తెలంగాణ ఎరుకల ప్రజా సమితి ఇటువంటి మరిన్ని ప్రజా ప్రయోజన కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తుందని నేతలు తెలిపారు.

## బయలుకించంగి గ్రామంలో అభివృద్ధి కొసరు



అల్లూరి జిల్లా, చింతపల్లి ఆకాంక్ష జూలై 05 :- చింతపల్లి మండలం చౌడుపల్లి పంచాయతీకి చెందిన బయలుకించంగి గ్రామ సమస్యలను పరిశీలించేందుకు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు, ఉపాధ్యక్షుడు కిముడు కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారాం శుక్రవారం గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్తులు కొర్ర కృష్ణ, కొర్ర చరణ్ ఆహ్వానంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్థులతో మమేకమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు బుజ్జిబాబు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ వైఫల్యంతో మన్య ప్రాంతాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా పరిస్థితి మారలేదు. ఇకనైనా ఈనాడు కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత మన పార్టీ నాయకులు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గారి నేతృత్వంలో మారుమూల ఏజెన్సీ ప్రాంతాలకు అభివృద్ధి కార్యాచరణ చేపడుతున్నారు అని అన్నారు. అలానే గ్రామానికి ఇప్పటివరకు కనీస మౌలిక సదుపాయాలు సైతం అందలేదని, కమ్యూనిటీ హాల్, డ్రైనేజీ, సీసీ రోడ్లు వంటి కీలక వసతుల కోసం గ్రామస్థులు వేచి చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సర్పంచులు ఓటు అడిగే సమయంలో మాత్రమే గ్రామాన్ని గుర్తు పెట్టుకుంటున్నారని, ప్రజల సమస్యలపై చిత్తశుద్ధితో పట్టించుకోవడం లేదని విమర్శించారు.

## ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేసిన ఎటీడబ్ల్యుఓ.



ఆకాంక్ష న్యూస్/అనంతగిరి అరకు జూలై 05 :- అనంతగిరి మండలంలోని మారుమూల జీనబాడు, పినకోట పంచాయతీలలో ఆశ్రమ పాఠశాలలను అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాసరావు శనివారం సందర్శించారు. అనంతరం స్కూల్ లో నిర్వహిస్తున్న బేస్ లైన్ అసిస్మెంట్ టెస్ట్ ను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి, పాఠశాలకు కావాల్సిన సౌకర్యాలు,సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జీనబాడు,పినకోట హెచ్ఎంలు, మల్లేశ్వరి,సోంబాబు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సుపరిపాలనలో తొలి అడుగు విజయవంతం



గంగవరం మండలం ఆకాంక్ష రిపోర్టర్ జులై 05 గంగవరంమండలంలో సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి కార్యక్రమంలో గంగవరం మండలం లోని చిన్న అడ్డపల్లి, పెద్ద అడ్డపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి సుపరిపాలనలో తొలిఅడుగు ఇంటింటికి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీష దేవి ఇంటింటికి వెళ్లి రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం, నియోజకవర్గంలో గత ఏడాదిగా చేస్తున్న అభివృద్ధి, పెట్టుబడులు, సంక్షేమ కార్యక్రమాల గురించి స్థానిక ప్రజలకు వివరిస్తూ, సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా తెలుసుకుని, ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, కరపత్రాలను అందించారు. ప్రజలు వివరించి, స్థానిక సమస్యలను త్వరగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించడం జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో జీసీసీ డైరెక్టర్ గొర్లె సునీత, గంగవరం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పాము అర్జున్, రైతు అధికార ప్రతినిధి కనిగిరి రాంబాబు, పార్టీ ప్రధాన కార్యదర్శి టి. భాను ప్రకాష్, తీగలు ప్రభ, వీరభద్రారెడ్డి వెంకటరెడ్డి నరసన్న దొర, జనసేన పార్టీ మండల అధ్యక్షులు కుంజం సిద్దు, సుభాష్, నాగేశ్వరరావు, శ్యామల, చిన్నబ్బారెడ్డి, చిన్నారావు, సత్యవేణి, బుల్లియమ్మ, సునీత ఎన్డీఏ కూటమి నాయకులు, క్లస్టర్, యూనిట్, బూత్, కేఎస్ఎస్ సభ్యులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు...

## "గండి పోచమ్మ అమ్మవారి దర్శనం." తాత్కాలిక విరామం.



" ఆకాంక్ష " రిపోర్టర్: జూలై. 05 అల్లూరి సీతారామరాజు జిల్లా, దేవీపట్నం మండలం, గొందూరు గ్రామంలో వెంచేసియున్న స్వయంభు.. గండి పోచమ్మ అమ్మవారు, ఎల్లవేళలా నిత్యం పూజలు అందుకునే అమ్మ. పోలవరం ప్రాజెక్ట్, కాపర్ డ్యాం, కారణంగా గోదావరి వరద ప్రమాదకరస్థాయిలో,, నది ప్రవాహం ఉన్నందున.. అమ్మవారి గర్భగుడి నందు గోదావరి నీరు ప్రవేశించడం వల్ల,, అమ్మవారి దర్శనములు తాత్కాలికంగా నిలుపుదల చేయడం జరిగింది. కావున భక్తులు,,, ఎవరి జాగ్రత్తలు వారు తీసుకుంటూ మీ యొక్క అమ్మ వారి దర్శనమునకు కొంత కాలం వాయిదా వేసుకుని, దేవదాయ ధర్మదాయ శాఖ, కార్యనిర్వహణాధికారులు సూచనల మేరకు, గోదావరి పరిసర ప్రాంతాలకు వెళ్లకుండా, ఇనుప బారికేడ్లు, ఏర్పాటు చేయడం జరిగింది. మరలా తిరిగి గోదావరి వరద ఉధృతి తగ్గిన తర్వాత ఆలయ కార్యా నిర్వహణ సిబ్బంది.. అమ్మవారి దర్శనమునకు అనుమతించు తేదీని బహిరంగ ప్రకటన చేసేంతవరకు, ఆలయ గోదావరి నది చుట్టుప్రక్కల ప్రాంతాలలో,, భక్తులు, ఫోటోలు, సెల్ఫీలు, సరదాలకు పోయి ప్రాణాల మీదకు తెచ్చుకోకూడదని, గోదావరి నది ఒడ్డుకి దరిదాపులకు ఎవరు వెళ్ళకూడదని, ఆలయ కార్య నిర్వహణ సిబ్బంది ఓ ప్రకటనలో తెలియజేయడం జరిగింది.

# వారాలు గడుస్తున్న అధికారులు అభివృద్ధికి తోడ్పడటం లేదు.



అల్లూరి జిల్లా/ ఆకాంక్ష జూలై 5 : అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రధాన కేంద్రంల్లో అక్రమ కట్టడాలు, ఆక్రమణలు తొలగించాలని హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను తూచ తప్పకుండా పాటించి పాడేరు ప్రధాన కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు డిమాండ్ చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు మొదటి శనివారం ఆక్రమణల తొలగింపు పనులు మొదలు పెట్టి తరువాత రోడ్డు విస్తరణ పనులు ఆపేయడంతో ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు గారు పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద స్థానికులతో కలిసి బైఠాయించారు. నాలుగు గంటలపాటు జోరు వాన సైతం లెక్క చేయకుండా రోడ్డుపై ధర్నా చేపట్టారు. వర్షంలో తడుస్తూ స్థానికత కలిసే రోడ్డుపైనే భోజనాలు చేశారు,ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్,ప్రతి శనివారం విడతలు వారిగా షాపులు తొలగిస్తామని చెప్పారన్నారు,ఒక్క వారం మాత్రమే తొలంగుపు ప్రక్రియ చేపట్టి తర్వాత ఆరు వారాలు గడిచిన ఎటువంటి పనులు జరగడం లేదని అన్నారు. పాడేరు జిల్లా ప్రధాన కేంద్రం కావడంతో రోజురోజుకు వాహనాల రద్దీ ఎక్కువై ట్రాపిక్ అంతరాయాలు కలుగుతుందన్నారు, ప్రతి ఒక్కరూ అభివృధి కోరుకుంటున్నారన్నారు. ఆక్రమణల తొలగింపు నిలిచిపోవడంతో మెజార్టీ ప్రజాభిప్రాయాలు మేరకే తాను ఉద్యమం చేస్తున్ననన్నారు. నాలుగు గంటల పాటు ఆందోళన కారణంగా సుమారు నాలుగు గంటల మేర ట్రాపిక్ అటూ ఇటూ ఆగిపోయింది. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆందోళన చేస్తున్న వారి వద్దకు వచ్చారు. సోమవారం కో ఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేసి ఆక్రమణల తొలగింపు పై చర్యలు తీసుకుంటామని ఆక్రమణల తొలగింపు కచ్చితంగా చేపడతామని కలెక్టర్ స్పష్టమైన హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షుడు సిదరి రాంబాబు, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు వనుగు బసవన్న దొర, కించురు సర్పంచ్ వంతల రాంబాబు, జిల్లా అధికార ప్రతినిధి కూడా సురేష్ కుమార్, పార్టీ సీనియర్ నేత కూడా సుబ్రహ్మణ్యం, రుడకోట పంచాయతీ సర్పంచ్, అధ్యక్షుడు కాతరి సురేష్ కుమార్, మాజీ సర్పంచ్ మినుములకనా న్నపాత్రుడు, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు గంగరాజు,గుల్లేలి లింగమూర్తి, ఈశ్వరరావు, బాబి, అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

# నాసిరకంగా జాతీయ రహదారి పనులు



అల్లూరి జిల్లా/ ఆకాంక్ష జూలై 05 : అల్లూరి జిల్లా, హుకుంపేట ప్రధాన రహదారి కి అనుకుని వున్నా నూతన జాతీయ రహదారి నిర్మాణం నాసిరకంగా ఉందని బీజేవైఎం అరకు పార్లమెంట్ నాయకులు ధ్వజమెత్తారు, శనివారం బీజేవైఎం నాయకులు జాతీయ రహదారి నీ పరిశీలించారు, అనంతరం బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మినుముల గోపాల పాత్రుడు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాన్ని జాతీయ రహదారులతో అభివృద్ధి చెయ్యాలని కేంద్రం లో నరేంద్ర మోదీ నేతృత్వం లోని భారత ప్రభుత్వం అరకు నుంచి రాజమండ్రి మీదుగా భద్రచలం వరకు జాతీయ రహదారి నిర్మాణం కోసం కోట్ల రూపాయల నిధులు విడుదల చేసిందన్నారు, అధికారుల పర్యవేక్షణ లోపం గా సంబంధిత గుత్తేదారు హుకుంపేట కు అనుకున్న వున్నా జాతీయ రహదారి నీ నాణ్యత లోపం గా నిర్మించారాని ఆరోపించారు, ఇటీవల కురిసిన చిన్న పాటి వర్షాలకే చాలా చోట్ల రోడ్డు బీటలు వారిందని తెలిపారు, క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఈ జాతీయ రహదారి నిర్మాణం ను ఒక్కసారి అయినా పరిశీలించారా అనీ ప్రశ్నించారు, జిల్లా కలెక్టర్ స్పందించి నాణ్యత ప్రమాణాలు పాటించని గుత్తేదారు పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు, లేని పక్షం లో జాతీయ రోడ్డు, భవన నిర్మాణ శాఖ మంత్రిత్వ శాఖకు పిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు, ఈ కార్యక్రమం లో బీజేవైఎం జిల్లా అధ్యక్షులు గెమ్మెలి కొండ బాబు, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పాంగి మత్స్య కొండ బాబు, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొల్లోరి కృష్ణ తదితరులు తెలియజేశారు.

# సుంకరమెట్ట లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం.

ఆకాంక్ష న్యూస్/అనంతగిరి అరకు జూలై 05 :- అరకు వేలి మండలం సుంకరమెట్ట పంచాయతీ సుంకరమెట్ట పరిధిలో గల గ్రామంలో గడపగడప తిరుగుతూ సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొనీ ప్రజలకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి గురించి ప్రజల ద్వారా తెలుసుకుంటూ ఇంటి ఇంటికి వెళ్ళి ప్రభుత్వం పనితీరు,ప్రజల ద్వారా వచ్చే స్పందన తెలుసుకుంటున్న అరకువేలి నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ ఆర్టీసీ రీజినల్ చైర్మన్ విజయనగరం సియ్యారి దొన్నుదొర అరకు వ్యాలీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు శివరామకృష్ణ అనంతరం ప్రజలతో కలిసి ప్రజలకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరిస్తూ ఇది మన మంచి ప్రభుత్వం రాబోయే రోజులో మరిన్ని సంక్షేమం, అభివృద్ధి పథకాలతో మందుకొస్తుందని ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి కార్యక్రమాలు సమర్ధవంతంగా నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల మహిళా అధ్యక్షురాలు బోరీబోరీ



లక్ష్మి,పాడి చందు,తెదేపా పంచాయితీ నాయకులు కొర్ర సంజీవ్ రావు,రాము సింహాద్రి,రామన్న,రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# మెగా పేరెంట్స్ డే విజయవంతం చేయాలి



అల్లూరి జిల్లా/ఆకాంక్ష జులై 05: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మెగా తలిదండ్రుల దినోత్సవం విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. మెగా పేరెంట్స్ డే, తల్లికి వందన అమలుపై శనివారం కలెక్టరేట్ లో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10 తేదీన 2900 పాఠశాలల్లో మెగా పేరెంట్స్ డే నిర్వహిస్తున్నామని స్పష్టం చేసారు. జిల్లా లో 1.07 లక్షల మంది విద్యార్థులు ఉన్నారన్నారు. 2900 పాఠశాలల్లో మోగా పేరెంట్స్ డే నిర్వహణకు రూ.61 లక్షల 11 వేల నిధులు పాఠశాలలకు విడుదల చేసామన్నారు. అన్ని యాజమాన్యాల ప్రభుత్వ పాఠశాలలు, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ప్రవేటు పాఠశాలల్లో మెగా పేరెంట్స్ డే నిర్వహిస్తున్నామని చెప్పారు. పాఠశాలలను సుందరంగా అలంకరించి విద్యార్థుల తలిదండ్రులను మర్యాదపూర్వకంగా ఆహ్వానించి పండగ వాతా వరణంలో పేరెంట్స్ డే జరుగుతుందన్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగు పరచడానికి తగిన సామర్థ్యాలపై చర్యలు చేపట్టామని చెప్పారు. విద్యార్థుల విద్యా తలిదండ్రుల చర్చించడం జరుగుతుందన్నారు. తలిదండ్రుల దినోత్సవం నిర్వహణలో పాఠశాల మేనేజ్ మెంట్ కమిటీ కీలకంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రతీ మండలాలనికి పేరెంట్స్ డే నిర్వహణకు మండల ప్రత్యేకాధికారులను నియమించామని చెప్పారు. విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి పాఠశాలల్లో రాష్ట్రీయ స్వాస్థ్య కార్యక్రమాలు అమలు చేయడానికి ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. బాలికల రక్షణ, సైబర్ క్రైమ్, ఆరోగ్యం, డ్రగ్స్ వద్దు బ్రో, గంజాయి నిర్మూలనపై అవగాహన కల్పిస్తారన్నారు. తల్లికి వందానం ప్రోత్సాహకాన్ని మొదటి విడతలో 1లక్ష 56 వేల 182 మంది విద్యార్థులకు 1 లక్ష 52 వేల,053 మంది తల్లుల ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. ఆధార్ నంబర్లు, బ్యాంకు ఖాతాలు సక్రమంగా లేనివారికి సరిచేసి రెండవ దశలో ఈనెల 10వ తేదీన తల్లికి వందనం జమ చేయడం జరుగుతుందన్నారు. మెగా పేరెంట్ మీట్లో రగవల్లులు, క్రీడలు నిర్వహిస్తారని చెప్పారు. అదే విధంగా జరుగుతుందని అన్నారు. లక్ష మొక్కలు నాటడం,ఆకాంక్ష జిల్లాకు రూ. 10 కోట్ల నిధులు విడుదల, అల్లూరి సీతారామ రాజు ఆకాంక్ష జిల్లా కావడం వలన నీతి ఆయోగ్ రూ.10 కోట్ల నిధులు విడుదల చేసిందన్నారు. ఆయా నిధులను విద్యాభివృద్ధికి వ్యయం చేస్తామన్నారు. జిల్లాలో ఐదు మోడల్ పాఠశాలలను ఏర్పాటు చేసి వాలీబాల్, కబడ్డీ, ఆర్చరీ, అథ్లెటిక్స్, రెజ్లింగ్ తదితర క్రీడలలో శిక్షణ అందిస్తామన్నారు. ప్రత్యేకంగా ఫిజికల్ డైరెక్టర్లను, వ్యాయామ ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు క్రీడల్లో తగిన శిక్షణ అందించి జాతీయ, అంతార్జాతీయ క్రీడలల్లో పాల్గొని పతకాలు సాధించే విధంగా విద్యార్థులకు శిక్షణ అందిస్తామన్నారు. గతంలో మాదిరిగా సూపర్ 50 తరగతులు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడానికి శిక్షణ అందిస్తామన్నారు. మనబడి మన భవిష్యత్తు కింద భవనాలు లేని 436 పాఠశాల గుర్తించి రూ.56 కోట్లతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదించామని అన్నారు. ప్రస్తుతం అత్యవసరంగా మండలానికి మూడు పాఠశాలలను ఎంపిక చేసి మరమ్మతులు చేయడానికి చర్యలు చేపట్టామని చెప్పారు. ఆశ్రమ పాఠశాలల్లో వసతి, నాణ్యమైన భోజన సదుపాయాలు, వైద్య సేవలు, విద్యా ప్రమాణాలు పర్యవేక్షణకు ఐటిడిఏ మోనటరింగ్ సెల్ ఏర్పాటు చేస్తున్నామని స్పష్టం చేసారు. వారపు సంతల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేయిస్తామని అన్నారు. జారీ : డిపి ఆర్ ఓ, ఎ ఎస్సార్ జిల్లా, పాడేరు.



# మంచిర్యాల జిల్లా కాసిపేటలో కార్డన్ సెర్చ్



**మంచిర్యాల(ఆకాంక్ష న్యూస్) :** మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం మామిడిగూడెం గ్రామంలో శనివారం పోలీస్ శాఖ భారీ తనిఖీలు నిర్వహించింది. మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి నేతృత్వంలో ఎస్సైలు, పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు కలసి కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం కింద కార్డన్ సెర్చ్ చేపట్టారు. ఈ తనిఖీలలో వాహన పత్రాలు సరిగా లేని 25 వాహనాలను గుర్తించి సీజ్ చేశారు. అలాగే మూడు ద్విచక్రవాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా విక్రయిస్తున్న వ్యక్తి వద్ద రెండు నిమిషాల లీటర్ల గుడుంబా పట్టుబడగా, రెండు బెల్ట్ షాపుల్లో ఉన్న మద్యం స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వారిపై కేసులు నమోదు చేశారు. డాగ్ స్క్వాడ్ సహాయంతో గ్రామంలో క్షుణ్ణంగా తనిఖీలు కొనసాగించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ మాట్లాడుతూ, "చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. నేరాల నివారణకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నాం," అని పేర్కొన్నారు. ప్రజల రక్షణ, భద్రత పోలీసుల ప్రధాన బాధ్యతేనని తెలిపారు. గ్రామాల్లో కొత్తగా ఎవరు అద్దెకు వస్తే, వారికి సంబంధించిన సమాచారం స్థానిక పోలీసులకు అందించాలని సూచించారు. నేరస్థులు గ్రామాల్లో ఆశ్రయం పొందకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువత చెడు అలవాట్లలో పడకుండా జాగ్రత్తగా ఉండాలని, వారి భవిష్యత్తును పాడుచేసుకోవద్దని హెచ్చరించారు. సమస్యలు ఉంటే వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలని కోరారు. సైబర్ నేరాలకు సంబంధించి ఫోన్ కాల్స్, మెసేజులు, వాట్సాప్ సందేశాలకు స్పందించవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాసిపేట ఎస్సై ప్రవీణ్ కుమార్, దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు, మందమర్రి ఎస్సై, ఏఎస్సై బూర రవీందర్, మందమర్రి సర్కిల్ పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దామోదర్ లొంగుబాటు వార్తలు పచ్చి అబద్ధం


భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
తెలంగాణ రాష్ట్ర కమిటీ
పత్రికా ప్రకటన
7/5/2025
జగన్
అధికార ప్రతినిధి

**ములుగు జిల్లా(ఆకాంక్ష న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర మావోయిస్టు పార్టీ కీలక నాయకుడు దామోదర్ లొంగిపోతున్నట్లు మీడియాలో, సోషల్‌మీడియాలో వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ ఖండించారు. ఈ మేరకు ఆయన ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు. ప్రచార మాధ్యమాల్లో ఉద్దేశపూర్వకంగా మావోయిస్టు ఉద్యమాన్ని, ప్రజల్లోని విప్లవ ఆలోచనలను భ్రష్టు పట్టించేలా ఈ విధమైన అప్రామాణికమైన కథనాలు ప్రచారంలోకి వస్తున్నాయని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు కావాలనే తప్పుడు సమాచారాన్ని వ్యాపింపజేస్తూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. దామోదర్ లొంగిపోతున్నట్లుగతంలోనూ ఎన్నోసార్లు అలాంటి తప్పుడు కథనాలు వచ్చాయని, అప్పట్లో కూడా ఆయన ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడని అవాస్తవాలను ప్రచారం చేశారని జగన్ తెలిపారు. ఈ ప్రచారం అంతా దుష్ప్రచారమేనని స్పష్టం చేశారు. ఇటీవల జూన్ 26వ తేదీన మంత్రి సీతక్కపై వెలువడిన పత్రికా ప్రకటనకు తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని కూడా ఆయన స్పష్టం చేశారు. అలాంటి ప్రకటనలు తమ ఉద్యమ లక్ష్యాలకు విరుద్ధమని పేర్కొన్నారు. విప్లవ ప్రజలను గందరగోళానికి గురిచేసేందుకు పోలీసు యంత్రాంగమే కావాలనే ఈ తప్పుడు ప్రచారాన్ని నడిపిస్తోంది. దాంతో పాటు, ప్రజలలో భయాందోళనలు కలిగించేందుకు కుట్రపూరితంగా పనిచేస్తోంది అని జగన్ ఆరోపించారు. ఇలాంటి సందర్భాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నిజాన్ని గుర్తించగల సామర్థ్యం తమలో ఉండాలంటూ ఆయన పిలుపునిచ్చారు. ప్రజా ఉద్యమాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అణచివేయలేరని స్పష్టం చేశారు.

# లారీని ఢీకొన్న ఆటో నాగర్‌కర్నూల్ జిల్లా మరికల్‌లో వ్యక్తి మృతి

**నాగర్‌కర్నూల్(ఆకాంక్ష న్యూస్):** నారాయణపేట జిల్లా సరిహద్దులోని మరికల్ మండలంలో జరిగిన ఘోర రోడ్డుప్రమాదం ఒక కుటుంబాన్ని విషాదంలోకి నెట్టింది. లారీని ఢీకొన్న ఆటో ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. వివరాల్లోకి వెళ్తే.. నాగర్‌కర్నూల్ జిల్లాలోని మరికల్ మండల కేంద్రానికి సమీపంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన పార్థివ్ (34) అనే వ్యక్తి ఆటో నడుపుతూ వెళ్తున్న సమయంలో ప్రమాదం జరిగింది. రోడ్డుపై ఆగి ఉన్న ఓ లారీని అతని ఆటో వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పార్థివ్ తీవ్రంగా గాయపడటంతో వెంటనే స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా మహబూబ్‌నగర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అతని పరిస్థితి విషమించి ఉండటంతో, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. మరికల్ ఎస్ఐ రాము వెల్లడించిన వివరాల ప్రకారం, మృతుడు పార్థివ్‌కు భార్య, ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు. ఈ ఘటనతో కుటుంబంలో విషాదచాయలు అలముకున్నాయి. ప్రమాదానికి సంబంధించి పార్థివ్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రోడ్డుపై ఆగి ఉన్న లారీ ఎందుకు ఆగిందన్న అంశంతోపాటు, ప్రమాదానికి మరేదైనా కారణాలున్నాయా అన్న కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. ఈ ఘటన గ్రామస్తుల్లో తీవ్ర విషాదాన్ని కలిగించింది. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని సందర్శించిన పోలీసులు, స్థానికుల సహాయంతో రోడ్డును క్లియర్ చేసి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. పార్థివ్ మృతితో పాటు అతని కుటుంబ భవిష్యత్తుపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. సర్కారు నుండి సహాయం అందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# మక్తల్‌లో కుక్కల దాడి..పది గొర్రెలు మృతి, ఇరవై గొర్రె పిల్లలకు గాయాలు

**నాగర్‌కర్నూల్(ఆకాంక్ష న్యూస్) :** నాగర్‌కర్నూల్ జిల్లా మక్తల్ మండలం గుర్లపల్లి గ్రామంలో కుక్కల దాడి తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. గ్రామ శివారులోని వ్యవసాయ పొలాల్లో కాపరి కుటుంబం వేసిన తాత్కాలిక గేదె షెడ్డు వద్ద కుక్కలు దాడికి దిగాయి. ఈ దాడిలో పది గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇరవై గొర్రె పిల్లలు తీవ్రంగా గాయపడ్డాయి. బాధితులు వెంకటప్ప, నరేష్, ఎల్లప్పల వివరాల ప్రకారం వారు ప్రతి రోజు మాదిరిగానే పొలాల్లోని చెట్టు దగ్గర ఇనుప గ్రిల్‌లో గొర్రె పిల్లలను ఉంచి, పెద్ద గొర్రెలను మేతకోసం బయటకు తీసుకెళ్లారు. కానీ నిన్న రాత్రి అనుకోని విధంగా కొన్ని కుక్కలు గొర్రెల మందపై దాడికి దిగాయని, అందులో పది గొర్రెలు చనిపోయాయని, 20కి పైగా గొర్రె పిల్లలు గాయపడినట్టు చెప్పారు. గొర్రెలే తమ జీవనాధారమని, ఇవి మృతి చెందడం వల్ల తాము తీవ్రమైన ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొంటున్నామని బాధితులు వాపోయారు. పశుసంవర్ధక శాఖ అధికారులు, గ్రామ పంచాయతీ ప్రతినిధులు రంగంలోకి దిగాలని, గ్రామంలో పెడుతున్న వీరికి భద్రత కల్పిస్తూ కుక్కల సంఖ్యను నియంత్రించాల్సిందిగా వారు కోరుతున్నారు. ఈ ఘటనపై సంబంధిత అధికారుల స్పందన ఇంకా రాక పోవడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాపరి కుటుంబాలకు న్యాయం జరగాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# పోలీసులకు నకిలీ ఎస్ఐగా బురిడీ పెట్టిన మహిళ..



**రాజస్థాన్(ఆకాంక్ష న్యూస్) :** రాజస్థాన్‌లోని నాగౌర్ జిల్లా నింబా కే బాస్ గ్రామానికి చెందిన మోనా బుగాలియా అనే మహిళ పోలీసులను బురిడీ కొట్టించిన ఘటన తీవ్ర సంచలనం రేపుతోంది. 2021లో సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) నియామక పరీక్షలో అర్హత సాధించలేకపోయిన మోనా, 'మూలి దేవి' అనే నకిలీ పేరుతో తప్పుడు పత్రాలు సృష్టించి రెండు సంవత్సరాలపాటు రాజస్థాన్ పోలీస్ అకాడమీలో ట్రైనీ ఎస్ఐగా శిక్షణ పొందింది. మూలి దేవిగా అకాడమీలో ప్రవేశించిన మోనా, స్పోర్ట్స్ కోటా అభ్యర్థిగా తనను పరిచయం చేసుకుంది. పోలీస్ యూనిఫాం ధరించి పరేడ్‌ల్లో పాల్గొనడమే కాకుండా, ఐపీఎస్ అధికారులతో కలిసి ఫోటోలు దిగింది. టెన్నిస్ ఆడింది. క్యాంపస్‌లో రీల్స్ తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ అధికారుల దృష్టిని మరల్చింది. పోలీస్ అకాడమీలో నిషేధిత ప్రాంతాల్లో స్వేచ్ఛగా సంచరించింది. బహిరంగ వేదికలపై ప్రసంగాలు కూడా చేసింది. 2023లో కొంతమంది ట్రైనీ ఎస్ఐలు ఆమె ప్రవర్తనపై అనుమానం వ్యక్తం చేయడంతో, సీనియర్ పోలీస్ అధికారులు అంతర్గత విచారణ చేపట్టారు. దర్యాప్తులో మూలి దేవిగా శిక్షణ పొందుతోన్న మహిళ అసలు పేరు మోనా బుగాలియాగా తేలింది. దీంతో ఆమెపై కేసు నమోదైంది. కేసు నమోదైన తరువాత మోనా పరారీలోకి వెళ్లగా, తాజాగా ఆమెను సికర్ జిల్లాలో అరెస్ట్ చేశారు. ఆమె నివాస గృహంపై పోలీసులు సోదాలు నిర్వహించి రూ.7 లక్షల నగదు, మూడు నకిలీ పోలీస్ యూనిఫామ్స్, పరీక్షా పత్రాలు, నకిలీ గుర్తింపు పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. మోనా విచారణలో మాట్లాడుతూ తాను లారీ డ్రైవర్ కుమార్తెనని, తాను పోలీస్ అధికారిణిగా ఎదిగి కుటుంబాన్ని ఆకట్టుకోవాలని భావించి ఈ మార్గాన్ని ఎంచుకున్నట్లు చెప్పింది. కాగా, అత్యంత భద్రత కలిగిన పోలీస్ అకాడమీలో ఇంతకాలం నకిలీ ట్రైనీగా మోసగించగలగడం ప్రభుత్వ వ్యవస్థలపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతోంది. ప్రస్తుతం మోనాపై నకిలీ పత్రాలు రూపొందించడం, ప్రభుత్వ శాఖను మోసం చేయడం వంటి ఆరోపణలపై కేసు నమోదు చేసి, పోలీసులు దర్యాప్తును కొనసాగిస్తున్నారు. ఆమెకు సహకరించినవారిని గుర్తించే దిశగా దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది.

# ఏటూరి శ్రావణ్ కుమార్‌కు అర్చక సంఘం జిల్లా అధ్యక్ష పదవి...



**గోదావరిఖని(ఆకాంక్ష న్యూస్):** తెలంగాణ ధూప దీప నైవేద్య అర్చక సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా ఏటూరి శ్రావణ్ కుమార్ ఆచార్యులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమం పెద్దపల్లి హనుమాన్ దేవాలయంలో శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు పేరంబుదూరు శ్రీకాంత్ ఆచార్యులు, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నిట్టూరి సతీష్ శర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాందూరి దామోదరచార్యులు హాజరయ్యారు. వారి చేతుల మీదుగా ఏటూరి శ్రావణ్ కుమార్‌కు అధికారికంగా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రామగుండం మండల అధ్యక్షుడు రుద్రపట్ల సత్యనారాయణ శర్మ, కరీంనగర్ ఉమ్మడి జిల్లా మరియు వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్తగా నియమితులైన ఏటూరి శ్రావణ్ కుమార్‌కు హాజరైన ప్రతినిధులు అభినందనలు తెలియజేశారు.

# తెలంగాణలో గుర్తింపులేని 13 పార్టీలకు ఈసీ నోటీసులు....


"TOP-PRIORITY" "BY E-MAIL / POST"
OFFICE OF THE CHIEF ELECTORAL OFFICER, TELANGANA
GENERAL ADMINISTRATION (ELECTIONS) DEPARTMENT
9th Floor, B.R.K.R Bhavan, Adarsh Nagar, Hyderabad -500 063.
Memo.No.732/Elecs.D/2025-52, Dated:04.07.2025.

Sub:- ELECTION – Show Cause Notice to Registered Unrecognized Political Parties (RUPPs) of Telangana – Communicated – Report Called for - Reg.

Ref:- Under Secretary Election Commission of India, New Delhi Lr.No: 56/2025/PPS-III, dated. 26-06-2025

-:o0o:-

Copy of the reference cited together with the Show Cause Notice induplicate to the (13) RUPPs of Telangana State is sent herewith to the DEOs & Collectors as shown below:

| Sl. No | Name of the Party | Name of the District in which the party's office is located | Notice sent to the DEO/ District Collector |
|---|---|---|---|
| 1 | Telangana Karmika Raithu Rajyam Party | Hanumakonda | Hanumakonda |
| 2. | Indian Minorities Political Party | Hyderabad | Commissioner GHMC |
| 3. | Jago Party | Hyderabad | Commissioner GHMC |
| 4. | National People's Congress | Hyderabad | Commissioner GHMC |
| 5. | Telangana Loksatta Party | Hyderabad | Commissioner GHMC |
| 6. | Telangana Minorities OBC Rajyam | Hyderabad | Commissioner GHMC |
| 7. | Yuva Party | Hyderabad | Commissioner GHMC |
| 8. | Bahujan Samaj Party (Ambedkar-Phule) | Medchal-Malkajgiri | Medchal Malkajgiri |
| 9. | Telangana Students United For Nation Party | Medchal Malkajgiri | Medchal Malkajgiri |
| 10. | Andhra Pradesh Rashtra Samaikya Samithi Party | Ranga Reddy | Ranga Reddy |
| 11. | Jatiya Mahila Party | Ranga Reddy | Ranga Reddy |
| 12. | Yuva Telangana Party | Ranga Reddy | Ranga Reddy |
| 13. | Telangana Praja Samithi (Kishore, Rao and Kishan) | Warangal | Warangal |

The concerned DEOs are requested to serve the Show Cause Notice to the concerned RUPPs and get the notice published along with the names of the parties in the form of an advertisement in National and Local newspapers and also publicity needs to be given in media and social media as well. Further you are requested to

(P.T.O)

**హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) :** తెలంగాణ రాష్ట్రంలో గత ఆరేళ్లుగా ఎలాంటి స్థానిక, అసెంబ్లీ లేదా పార్లమెంట్ ఎన్నికల్లోనూ పోటీ చేయని 13 గుర్తింపులేని రాజకీయ పార్టీలకు ఎన్నికల సంఘం (%జుజ%) నోటీసులు జారీ చేసింది. ఈ పార్టీల ప్రాతినిధ్యాన్ని, క్రియాశీలతను పరిగణలోకి తీసుకొని వివరణ కోరింది. ఆయా పార్టీల ప్రతినిధులను అనుమతించిన గడువులోగా హాజరు కావాలని, తమ కార్యకలాపాలపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఈ ప్రక్రియ అనంతరం డీలిస్టింగ్ (పార్టీని గుర్తింపు లేని జాబితా నుండి తొలగించడం)పై తుది నిర్ణయం తీసుకోనుందని ఎన్నికల సంఘం పేర్కొంది. ఈ చర్యలతో రాష్ట్ర రాజకీయాల్లో కాస్త కదలికలు మొదలయ్యే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ఇలాంటి చర్యలు పార్టీలు ఆచరణలో ఉన్నాయి కాదా అన్న విషయాన్ని ఆవిష్కరించడంలో ఎన్నికల సంఘానికి దోహదపడతాయని అధికారులు చెబుతున్నారు.

# నిజామాబాద్ జిల్లాలో ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ మానవత్వం



**నిజామాబాద్(ఆకాంక్ష న్యూస్) :** నిజామాబాద్ నగరంలోని కంటేశ్వర్ బైపాస్ సర్కిల్ వద్ద శనివారం ఉదయం ఘటించిన సంఘటన స్థానికులను కదిలించింది. వినాయకనగర్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా, అకస్మాత్తుగా బీపీ తక్కువవడం వల్ల గుల్లనిపించి రోడ్డుపైకి పడిపోయాడు. దీంతో అతడు గాయాల పాలయ్యాడు. ఈ ప్రమాదాన్ని గమనించిన ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ సంజీవ్ వెంటనే స్పందించాడు. ప్రమాద స్థలంలోనే డ్యూటీలో ఉన్న సంజీవ్, వెంటనే గాయపడిన వ్యక్తిని దగ్గరలో ఉన్న ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించాడు. అనంతరం అంబులెన్సును ఏర్పాటు చేసి, అతడిని హుటాహుటిన సమీప ప్రభుత్వ దవాఖానకు తరలించారు. సంజీవ్ చూపిన మానవత్వం స్థానికుల మెప్పు పొందింది. విధిలో ఉన్నపుడే అప్రమత్తంగా స్పందించి ప్రాణాలను కాపాడే ప్రయత్నం చేసిన ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ సంజీవ్‌ను ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ట్రాఫిక్ సీఐ ప్రసాద్, అక్కడి ప్రజలు అభినందించారు. ఇలాంటి సంఘటనలు పోలీసుల మానవీయ వైఖరిని వెలుగులోకి తెస్తున్నాయని స్థానికులు ప్రశంసించారు.

# బీజేపీ విధానాలపై అసహనం ఉన్నవారు వెళ్లిపోతే నష్టం ఏమీ లేదు - రామచంద్రరావు



**హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) :** బీజేపీకి నమ్మకంగా పనిచేసే నేతలకు ఎప్పుడూ న్యాయం జరుగుతుందని, ఎవరికైనా పార్టీ విధానాలు నచ్చకపోతే వెళ్లిపోవచ్చు కానీ పార్టీకి దానివల్ల ఎలాంటి నష్టం ఉండదని తెలంగాణ రాష్ట్ర బీజేపీ నూతన అధ్యక్షుడు రామచంద్రరావు స్పష్టం చేశారు. ఈ రోజు హైదరాబాద్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రామచంద్రరావు రాష్ట్ర అధ్యక్షుడిగా అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు. బాధ్యతలు చేపట్టే ముందు రామచంద్రరావు చార్మినార్ సమీపంలోని భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, పార్టీకి అంకితంగా పనిచేసే వారికి అవకాశాలు లభిస్తాయని, తాను అందుకు జీవింత ఉదాహరణనని చెప్పారు. బీజేపీ విధానాలు, సిద్ధాంతాలు నచ్చని వారు వెళ్లిపోతే ఎలాంటి నష్టం ఉండదు. కానీ పార్టీని విశ్వసించిన వారిని మోసం చేయడం బీజేపీ నైజం కాదు. పార్టీ శ్రేయస్సు కోసం పని చేసిన ప్రతీ ఒక్కరికీ గుర్తింపు లభిస్తుంది," అని రామచంద్రరావు స్పష్టం చేశారు. తన అధ్యక్షతన పార్టీ రాష్ట్రంలో బలపడేలా చర్యలు తీసుకుంటామని, ప్రతి కార్యకర్తతో కలిసి ముందుకు సాగే ప్రయత్నం చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో బీజేపీని శక్తివంతమైన ప్రత్యామ్నాయంగా నిలబెట్టేందుకు అన్ని స్థాయిలలో ప్రయత్నిస్తామని చెప్పారు. రాష్ట్ర అధ్యక్ష పదవికి తాను వేషం వేసుకోవడం కాదని, నిజమైన బాధ్యతతో పని చేస్తానని స్పష్టంచేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి హాజరయ్యాయి.

# వృద్ధ తల్లికి పెద్దపల్లి కలెక్టర్ న్యాయం



**పెద్దపల్లి(ఆకాంక్ష న్యూస్):** తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే పిల్లలపై చట్టపరమైన చర్యలు తప్పవని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష స్పష్టం చేశారు. జన్మనిచ్చిన తల్లిదండ్రుల సంక్షేమాన్ని చూసుకోవాల్సిన బాధ్యత సంతానంపైనే ఉందని, వారికి హక్కులు చట్టబద్ధంగా కల్పించబడినవని అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం జరిగిన విచారణ సందర్భంగా, రామగుండం మండలం ఎఫ్‌సీఐ ఏరియాకు చెందిన ఓ వృద్ధురాలు చేసిన ఫిర్యాదును పరిశీలించిన కలెక్టర్, తాను నివసిస్తున్న ఇంట్లో తన కుమారుడి వల్ల మానసిక వేధింపులకు గురవుతున్నానని, అతడిని ఇంటి నుంచి పంపించాలని వృద్ధురాలు కోరినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో, ఆమె భర్త నిర్మించిన ఇంటిలో ఆమె మిగిలిన జీవితం ప్రశాంతంగా గడిపే హక్కు ఉన్నదని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ చట్టం%-%2007 కింద కేసును విచారించిన కలెక్టర్ శ్రీహర్ష, చట్టంలోని సెక్షన్ 23 మరియు 21(3)(బీ) ప్రకారం, వృద్ధురాలి కుమారుడు 30 రోజుల్లోగా ఇంటిని ఖాళీ చేయాలని, ఇకపై ఆమెను ఎటువంటి వేధింపులకు గురిచేయరాదని ఆదేశాలు జారీ చేశారు. ఇకపై ఆ ఆదేశాలను ఉల్లంఘించినచో సంబంధిత చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేగాక, ఈ తీర్పు అమలుకు సంబంధించి జిల్లా సంక్షేమ అధికారి, సంబంధిత పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యతను పిల్లలు తప్పించుకోలేరు. వారిని నిర్లక్ష్యం చేయడం నేరమే. ఎవరైనా వృద్ధులను వేధిస్తే, చట్టం చేతికి వారి నుండి తప్పించుకోలేరు" అని అన్నారు. ఈ తీర్పు వయోవృద్ధుల హక్కులకు గౌరవం కల్పించడమే కాక, వారిపై జరుగుతున్న వేధింపులకు చట్టపరంగా కఠినంగా సమాధానం చెప్పగలమన్న సందేశాన్ని సమాజానికి ఇచ్చింది.

# రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలో దుర్ఘటన...

## ఒక్కగానొక్క కూతురు బ్రెయిన్ స్ట్రోక్, గుండెపోటుతో మృతి....

**ఎల్లారెడ్డిపేట (ఆకాంక్ష న్యూస్)** మండల కేంద్రానికి చెందిన ఓ కుటుంబంలో విషాదం నెలకొంది. బ్రెయిన్‌స్ట్రోక్ అనంతరం గుండెపోటుతో ఒక్కగానొక్క కూతురు మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... ఎల్లారెడ్డిపేటకు చెందిన విశ్వనాథుల పూర్ణచందర్, కవిత దంపతుల ఏకైక కుమార్తె సాత్విక (16) కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. రెండు రోజుల క్రితం తల నొప్పి కారణంగా అస్వస్థతకు గురైన ఆమెను ఇంటికి తీసుకొచ్చారు. కంటి సమస్యగా భావించిన తల్లిదండ్రులు కంటి వైద్యుని దగ్గరకు తీసుకెళ్లి కళ్లద్దాలు వేయించాలనుకున్నారు. అయినప్పటికీ తలనొప్పి తగ్గకపోవడంతో, మందులు వేసినా ఫలితం లేకపోవడంతో ఆసుపత్రికి తీసుకెళ్లాలనుకున్నారు. శనివారం



ఉదయం అకస్మాత్తుగా స్పృహ తప్పి కిందపడిన సాత్విక అపస్మారక స్థితికి చేరింది. వెంటనే కుటుంబసభ్యులు ఆమెను స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు స్కాన్ చేసి మెదడులో రక్తం గడ్డ కట్టినట్టు గుర్తించి తక్షణమే శస్త్రచికిత్స చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆమెను థియేటర్‌కి తరలిస్తున్న క్రమంలో గుండెపోటు రావడంతో బాలిక ప్రాణాలు కోల్పోయింది. ఇది వరకే బాలిక తండ్రి పక్షవాతంతో పోరాడుతుండగా, కుటుంబ భారాన్ని మోయాలన్న సంకల్పంతో తల్లి కష్టాలు పడుతూ కూతురిని కార్పొరేట్ కళాశాలలో చదివించుతోంది. తమ జీవితాన్ని కూతురికి అంకితంగా పెట్టిన తల్లిదండ్రులు ఆమె మరణాన్ని జీర్ణించుకోలేక శోకసంద్రంలో మునిగిపోయారు. వారి రోదనలు చూసిన వారు కన్నీరు అదుపు చేసుకోలేకపోయారు. ఈ దుర్ఘటన ఎల్లారెడ్డిపేట మండలాన్ని విషాదంలో ముంచెత్తింది.



# కూతురు పుట్టినరోజున తల్లి, కొడుకుల ఆదర్శ నిర్ణయం...

**గోదావరిఖని(ఆకాంక్ష న్యూస్) :** పిల్లల పుట్టినరోజు అంటే విందులు, వినోదాలతో ఆడపడుచులు చేసే సంబరాలు కనిపించటం సహజం. అయితే, గోదావరిఖని పవర్ హౌజ్ కాలనీలో నివసించే కాంపెల్లి జయ మాత్రం తన కుమార్తె సుప్రియ పుట్టినరోజున సర్వసాధారణానికి భిన్నంగా, జీవితానంతర మానవతా సంకేతంగా నిలిచే అవయవదానం ప్రకటనతో ఆదర్శంగా నిలిచారు. జయ నిర్ణయం చూసిన ఆమె కుమారుడు శివ గణేష్ కూడా తల్లి అడుగుజాడల్లోనే నడిచి అవయవదానం చేయనున్నట్టు ప్రకటించాడు. శనివారం జయ కుమార్తె పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులు జయ, శివ గణేష్ లు తమ మరణానంతరం నేత్రాలు, అవయవాలు దానం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా వారి నివాసంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, మహిళా ప్రతినిధి శశికళ ఆర్గాన్ డోనర్ కార్డులను అందజేశారు. అలాగే జయ కుటుంబానికి అభినందన పత్రాలు అందించి, ఈ ఉత్తమ నిర్ణయాన్ని సత్కరించారు. కుటుంబాన్ని అభినందించినవారిలో సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, గౌరవాధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి, సలహాదారు నూక రమేశ్, కార్యదర్శి భీష్మాచారి, ప్రచార కార్యదర్శి వాసు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా లింగమూర్తి మాట్లాడుతూ...ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి మంచి మార్గదర్శకంగా నిలుస్తాయి. ఒక్కరి అవయవాలు ఎనిమిది మందికి జీవం అందించగలవు. జయగారిలాంటి వారు అనేకమందికి స్ఫూర్తిదాయకంగా మారాలి" అన్నారు. జయ %-% శివ గణేష్ ల త్యాగ స్ఫూర్తి అనేక కుటుంబాలకు జీవనవెచ్చులి అవుతుందని, సమాజంలో అవయవదాన పట్ల అవగాహన పెరగాలని అందరూ ఆకాంక్షించారు.

# కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ పేరుతో ఫేక్ కాల్స్...



**కరీంనగర్(ఆకాంక్ష న్యూస్) :** కరీంనగర్ నగరంలో సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతిలో మోసాలకు తెరలేపారు. నగర మున్సిపల్ కమిషనర్ పేరుతో ఫేక్ ఫోన్ కాల్స్ చేసి ప్రజలను మోసం చేస్తున్నారు. పన్నులు బకాయిలు ఉన్నాయంటూ బెదిరింపులతో పాటు, పేటీఎం స్కానర్‌లు పంపిస్తున్నామని చెప్పి డబ్బులు వసూలు చేయడమే లక్ష్యంగా నకిలీ కాల్స్ చేస్తున్నారు. ఈ విషయమై నగర మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ స్పందించారు. గత రెండు రోజులుగా మీరు నగరపాలక సంస్థకు పన్నులు బకాయి ఉన్నారు, చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. చెల్లింపుల కోసం స్కానర్ పంపిస్తున్నాం" అంటూ 9121097923 నెంబర్ సహా పలు నకిలీ నంబర్ల నుండి ఫోన్లు వస్తున్నాయని వెల్లడించారు. ఈ కాల్స్‌ను ఎవరూ నమ్మవద్దని, అసలు మున్సిపల్ అధికారులు ఈ తరహా ఫోన్‌కాల్స్ చేయరని స్పష్టం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏ చెల్లింపైనా అధికారిక పద్ధతుల ద్వారా మాత్రమే చేయాలని కోరారు. నగరపాలక సంస్థ పన్నులు %-% ఆస్తిపన్ను, ట్రేడ్ లైసెన్స్, నల్లా పన్నులు %-% చెక్ లేదా డిజిటల్ పేమెంట్స్ ద్వారా నేరుగా పౌర సేవా కేంద్రాలు, బిల్ కలెక్షన్ యంత్రాల ద్వారా వచ్చే బల్దియా సిబ్బందికి మాత్రమే చెల్లించాలన్నారు. ఇంటి నంబర్ ఆధారంగా మీ సేవా కేంద్రం లేదా %జణపీూ% వెబ్‌సైట్ ద్వారా సురక్షితంగా పన్నులు చెల్లించవచ్చునని పేర్కొన్నారు. ప్రతి ఆర్థిక సంవత్సరంలో పన్నులు సకాలంలో చెల్లించి వడ్డీలు పడకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ఈ మోసాలపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కమిషనర్ తెలిపారు. ప్రజలు ఎటువంటి సందేహాలైతే నగరపాలక సంస్థ అధికారులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. హెచ్చరిక: కమిషనర్ పేరుతో వచ్చే ఫేక్ కాల్స్‌కు బలవద్దు! అధికారిక చెల్లింపుల మార్గాలనే ఉపయోగించండి!



# అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో భారీ వర్షాలు.. 24 మంది మృతి

**న్యూయార్క్(ఆకాంక్ష న్యూస్) :** అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో భారీ వర్షాలు కురవడంతో నదులు ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. టెక్సాస్ వరదలు ముంచెత్తడంతో ప్రజలు విలవిలలాడిపోతున్నారు. భారీ వరదలు విలయతాండవం సృష్టించడంతో 24 మంది మృతి చెందారు. 30 మంది బాలికలు గల్లంతైనట్టు సమాచారం. పోలీసులు, రెస్క్యూ సిబ్బంది గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గ్వాడాలు పే నది ఉప్పొంగ ప్రవహిస్తుండడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. గ్వాడాలు పే నది తీరంలో క్రిస్టియన్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. ఈ క్యాంప్‌లోని భారీగా వరదలు రావడంతో 20 నుంచి 25 మంది బాలికలు గల్లంతయ్యారు. దీంతో బాలికల కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. పడవలు, హెలికాప్టర్ల సహాయంతో రెస్క్యూ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు.

# కాచిగూడలో డెమో రైలు కిందపడి గుర్తుతెలియని యువకుడు మృతి....

**హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) :** హైదరాబాద్ నగరంలో దురదృష్టకర ఘటన ఒకటి చోటుచేసుకుంది. కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో డెమో రైలు కిందపడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం విద్యానగర్ %-% కాచిగూడ స్టేషన్ల మధ్యలో జరిగింది. రైల్వే సీఐ ఎల్లప్ప అందించిన వివరాల ప్రకారం, సుమారు 25 ఏళ్ల వయస్సున్న ఓ గుర్తుతెలియని యువకుడు కాచిగూడ పూర్ణ డెమో రైలు కిందపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ప్రాథమికంగా ఇది ఆత్మహత్యగా భావిస్తున్నట్టు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే రైల్వే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతుడి శరీరాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి శరీరంపై తెలుపు రంగు ఫుల్ చొక్కా, నీలి రంగు జీన్స్ ప్యాంట్ ఉన్నట్టు పోలీసులు వెల్లడించారు. అతని ఎత్తు సుమారు 5 అడుగులు 5 అంగుళాలు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నట్టు రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపారు. మృతుడి వివరాలను గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎవరికైనా మృతుడి గురించి సమాచారం తెలిస్తే 87126 58584 నంబరుకు సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఘటన నగరంలో విషాదాన్ని నింపింది. యువకుడు ఎందుకు ఈ క్రమానికి పాల్పడ్డాడన్న కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. మృతుడి కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఆయన గత చరిత్రపై పూర్తి వివరాలు సేకరించేందుకు ప్రయత్నిస్తున్నారు.

# తులం బంగారం ఇచ్చేంత వరకు పోరాటం ఆగదు....



**హుజురాబాద్(ఆకాంక్ష న్యూస్):** కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాల కింద రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఆడబిడ్డకు తులం బంగారం ఇవ్వాల్సిందేనని, దానికి వరకు తన పోరాటం ఆగదని హుజూరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ శనివారం ఆయన వీడియో సందేశం విడుదల చేశారు. ఈ సందేశంలో కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ, హుజూరాబాద్ నియోజకవర్గంలోని హుజూరాబాద్, జమ్మికుంట, ఇల్లందకుంట మండలాలకు చెందిన మొత్తం 158 మంది లబ్ధిదారుల కళ్యాణలక్ష్మి ప్రపోజల్స్‌ను ప్రభుత్వం ముందు ఉంచామని, వీరికి ప్రకటించిన నిధులతో పాటు తులం బంగారం ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా రూ. 1,16,000 నగదుతో పాటు తులం బంగారాన్ని అందిస్తామని చెప్పిందని గుర్తు చేశారు. అందువల్ల, ఇప్పటికే చెక్కులు అందుకున్న లబ్ధిదారులకూ తులం బంగారం ఇవ్వాలని ఆయన ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చారు. ప్రతి ఆడబిడ్డకు గౌరవంగా ఈ పథకాల ప్రయోజనం అందాలి. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు పూర్తి సాయాన్ని ప్రభుత్వం ఇప్పించాలి. తులం బంగారం లాంటి హామీలను తుంచివేయడం తగదు. అలా జరిగితే నేను ఊరుకోను. ప్రశ్నిస్తూనే ఉంటాను. బంగారం ఇవ్వేంత వరకు నా పోరాటం ఆగదు," అని ఆయన స్పష్టంగా తెలిపారు. ఇకపై కూడా ప్రతి అర్హురాలికి ఈ పథకం ప్రయోజనాలు సమగ్రంగా అందేలా నియోజకవర్గం నుంచి పోరాటం కొనసాగిస్తానని హెచ్చరించారు. మహిళల జీవన ప్రమాణాలు మెరుగవ్వాలంటే ఈ పథకాలను పూర్తిగా అమలు చేయడం అత్యవసరమన్నారు. కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలు నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వం స్పందన ఏవిధంగా ఉంటుందో చూడాల్సివుంది.

# వీణవంక విద్యార్థిని నిఖితకు బాసర ఆర్జీయూకేటీ లో ప్రవేశం -అభినందనలు వెల్లువ



**వీణవంక(ఆకాంక్ష న్యూస్)** వీణవంక మండలంలోని చల్లూరు గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న నల్లగొండ నిఖిత బాసర ఆర్జీయూకేటీ (%=+ఖఖు%)లో ప్రవేశానికి ఎంపికైంది. ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంపత్ కుమారాచారి శనివారం అధికారికంగా వెల్లడించారు. నిఖిత ఇటీవల జరిగిన పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమంగా 562 మార్కులు సాధించి నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానాన్ని దక్కించుకుంది. ఈ ఘనతతో ఆమెకు బాసర ఆర్జీయూకేటీ ప్రవేశం లభించింది. ఈ సందర్భంగా హెచ్ఎం సంపత్‌కుమారాచారి, తహసీల్దార్ రజిత, ఎంపీడీవో శ్రీధర్, పాఠశాల ఉపాధ్యాయులు నిఖితను అభినందించారు. ఆమె భవిష్యత్తు విద్యాభ్యాసంలో మరింత మెరుగైన విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు. ప్రాంతీయ స్థాయిలో గర్వకారణమైన ఈ ఎంపిక పాఠశాల ఖ్యాతిని మరింత పెంచిందని విద్యావర్గాలు పేర్కొన్నాయి.

# వేములవాడలో విషాదం... నీటి సంపులో పడి బాలుడి మృతి

**వేములవాడ(ఆకాంక్ష న్యూస్) :** వేములవాడ మండలం చింతల్టన గ్రామంలో శనివారం ఓ ఆరేళ్ల బాలుడు నీటి సంపులో పడి మృతి చెందిన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. గ్రామానికి చెందిన లింగంపల్లి రవి, స్వప్న దంపతుల ఏకైక కుమారుడు లింగంపల్లి రిషీ(6) ఇంటి సమీపంలోని నిర్మాణంలో ఉన్న భవనం వద్ద తన స్నేహితులతో ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు నీటి సంపులో జారిపడ్డాడు. స్నేహితులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా, వారు వచ్చేసరికి రిషీ అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు గుర్తించారు. రవి-స్వప్న దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు ఉండగా, రిషీ ఒక్కడే కుమారుడు కావడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అప్రమత్తత లేకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



# దమ్ముంటే రేవంత్ రెడ్డి రాజీనామా చేసి..బీసీ నీ సీఎం చేయండి



తెలంగాణ బ్యూరో (ఆకాంక్ష న్యూస్) : మామూలు కార్యకర్తగా పార్టీలో పనిచేస్తూ, సైకిళ్లపై తిరుగుతూ పోస్టర్లు అంటించడం, బ్యానర్లు వేయడం, బూత్ ఏజెంట్‌గా పార్టీ కోసం నిబద్ధతతో పనిచేయడం ద్వారా నా రాజకీయ ప్రయాణం బిజెపిలో ప్రారంభమైందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు. బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్. రాంచందర్ రావు బాధ్యతలు స్వీకరించిన అనంతరం మీడియాతో మాట్లాదారు.విద్యార్థి పరిషత్‌లో ఉన్న సమయంలో ప్రారంభించిన ఉద్యమ స్వభావం, బిజెపిలో కొనసాగించాను. దేశంలో సొంత మెజార్టీతో బిజెపి ప్రభుత్వం 13 రాష్ట్రాల్లో అధికారంలో ఉంది. మరికొన్ని రాష్ట్రాల్లో ఎన్డీయే కూటమి ద్వారా అధికారంలో ఉంది.ఇటువంటి బలమైన పార్టీలో సాధారణ కార్యకర్తగా ఉన్న నాకు, పార్టీ అధిష్ఠానం నమ్మకంతో రాష్ట్ర అధ్యక్ష బాధ్యతను అప్పజెప్పడం, నేను పనిచేసిన కృషికి గుర్తింపుగా భావిస్తున్నాను.బిజెపి అంటే కార్యకర్తల పార్టీ. ఈ రోజు తెలంగాణలో 40 లక్షల మంది కార్యకర్తలు బూత్ స్థాయిలో అహర్నిశలు పనిచేస్తున్నారు.బిజెపి బలోపేతం వెనుక వేలాది మంది కార్యకర్తల త్యాగాలు ఉన్నాయి. వారి ప్రాణత్యాగాలే బిజెపిని 14 కోట్ల సభ్యత్వంతో ప్రపంచంలో అతిపెద్ద పార్టీగా అవతరించిందన్నారు.నేను కూడా ఒక కార్యకర్తగా అహోరాత్రులు పార్టీ కోసం కృషి చేశాను. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ %-% బీఆర్ఎస్ పార్టీలు రెండు విఫలమైన ప్రభుత్వాలు.ఈ రోజు తెలంగాణ ప్రజలు బిజెపిని అధికారంలోకి తీసుకురావాలని కోరుకుంటున్నారు. ప్రజలు బిజెపికి ఒక అవకాశం ఇవ్వాలనే భావనతో ఎదురుచూస్తున్నారు.గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రజలను మభ్యపెట్టే హామీలు ఇచ్చింది. రైతులు, మహిళలు, విద్యార్థులకు అనేక రకాల హామీలు ఇచ్చింది. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత, "డబ్బులేవు... ప్రభుత్వం భిక్షాటన స్థితిలో ఉంది... ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేకపోతున్నాం అని ఏడుస్తోందని ఎద్దేవా చేసారు..రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితులు ఉన్నప్పటికీ.. కాంగ్రెస్ పార్టీ హామీలు ఎలా ఇచ్చింది... ఇది ప్రజలను మోసం చేసే ఆలోచనే. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి ఇవాటిలో ఏవీ అమలు చేయలేదు. రైతుల రుణ మాఫీను పూర్తిగా చేయకుండా మధ్యలో నిలిపివేశారు. రైతు భరోసా పేరుతో రూ. 15 వేలు ఇస్తామని చెప్పి రూ. 12 వేలకు తగ్గించారు. ఇప్పటివరకు రెండు దఫాలు మోసం చేశారు. మళ్లీ సర్పంచ్ ఎన్నికలు వస్తున్నాయని హడావుడిగా రూ. 6 వేలు చొప్పున మాత్రమే రైతు భరోసా ఇచ్చి చేతులు దులుపుకున్నారు. రైతులను మోసం చేస్తే, దగా చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు.బిజెపి పట్ల ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని తెలుసుకున్న కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోంది. తెలంగాణలో యూరియా లేదంటూ" దుష్ప్రచారం చేస్తున్నారు.యూరియా కొరత యూపీఏ ప్రభుత్వంలోనే వచ్చింది. ఆ సమయంలో యూరియాకు రైతులు షాపుల ముందు క్యూలలో నిలబడాల్సి వచ్చేది. యూరియా దొరక్క రైతులు ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు జరిగాయి.కానీ ఇప్పుడు మోదీ ప్రభుత్వం తెలంగాణకు అవసరమైన మేరకు 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేసింది. అదనంగా 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను మంజూరు చేసింది.కేంద్రం పంపిన యూరియాను సకాలంలో సరఫరా చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు కలిగిస్తోంది. ఆ యూరియాను ఏమయ్యిందో చెప్పాలి. యూరియా సరఫరా విషయంలో బిజెపి చర్చకు సిద్ధంగా ఉంది. మరి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమా..?గ్రెస్ నిర్వహించిన "సామాజిక న్యాయ సమర భేరి" సభలో మోదీ గారు, బిజెపి, ఆర్ఎస్ఎస్‌ను విమర్శించడమే తప్ప సామాజికంగా వెనుకబడిన వర్గాల గురించి కనీసం మాట్లాడలేదు. 50 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ ప్రజల గురించి ఒక్కసారి కూడా ఆలోచించలేదు.కాంగ్రెస్ అవినీతి పాలనతో విసిగిపోయిన ప్రజలు కాంగ్రెస్ ముక్త్ భారత్ కోరుతూ వరుసగా మూడు సార్లు కాంగ్రెస్ పార్టీని ఓడించారు.బిజెపి ప్రజల కోసం పనిచేసే పార్టీ, కాంగ్రెస్ అధికారం కోసం, అవినీతి కోసం పనిచేసే పార్టీ. %నూ×జజ% అంటే %నూశ్రీశ్రీ ×అంఋ జప్త్రమ్ఋఅస్త్ర జశీఎఎ్‌వవ% అన్నట్టుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్.అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే ప్రజల మధ్య విపరీతమైన వ్యతిరేకతను ఎదుర్కొంటోంది కాంగ్రెస్. ఇంత తక్కువ కాలంలో ఇంతటి వ్యతిరేకత వచ్చిన పార్టీ మరొకటి లేదు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు గట్టి బుద్ధిచెబుతారు. నిన్నటి సభలో భవిష్యత్తులో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 ఎమ్మెల్యేలు, 15 ఎంపీ సీట్లు గెలుస్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పారు. బహుశా ఆ కాంగ్రెస్ నాయకులు టంగ్ స్లిప్ అయి మాట్లాడినట్లున్నారు. 100 మంది ఎమ్మెల్యేలు, 15 ఎంపీ సీట్లు బిజెపి గెలుస్తుందని చెప్పబోయి పొరపాటుగా కాంగ్రెస్ గెలుస్తుందని అన్నారు.రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు "కాంగ్రెస్ ముక్త్ భారత్" అని నినదిస్తారన్నారు. ప్రజలను మోసగించిన కాంగ్రెస్ ప్రభుత్వంపై బిజెపి ధర్మయుద్ధం చేస్తుంది.గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ కేవలం రెండు సీట్లు మాత్రమే గెలుచుకుంది. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయింది. బిజెపి మూడు ఎమ్మెల్సీ సీట్లు గెలుచుకుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు రూ. 4 వేల భృతి ఇస్తామని చెప్పి ఆ హామీని మర్చిపోయారు. సంపదతో ఉన్న తెలంగాణను భిక్షాటన చేసే స్థితికి తీసుకువచ్చారు.బిజెపి నాయకులు అందరి సహకారంతో, కార్యకర్తల బలంతో తెలంగాణ రాష్ట్రంలో బిజెపిని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేస్తాం.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు మెంబర్ల నుంచి జడ్పీటీసీల వరకు అన్ని సీట్లలో బిజెపి పోటీ చేస్తుంది. అత్యధిక స్థానాల్లో గెలుస్తుంది. హర్యానా, త్రిపుర వంటి రాష్ట్రాల్లో ప్రజలు బిజెపిని గెలిపించినట్లుగా తెలంగాణలోనూ గెలిపిస్తారు.బిజెపి పరిపాలనలో అవినీతి ఉండదు, అబద్ధాలు ఉండవు.తెలంగాణను వికసిత రాష్ట్రంగా మార్చేందుకు డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అవసరం. అందుకు కార్యకర్తలంతా కృషి చేయాలి.బిజెపి బలోపేతం అవుతోంది. త్వరలో రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయం."సెక్యులరిజం", "సోషలిజం" వంటి పదాలు కాంగ్రెస్ విధించిన ఎమర్జెన్సీ తర్వాత రాజ్యాంగంలో చేర్చబడ్డాయి. కాంగ్రెస్ మతపరమైన రాజకీయాలతో ఈ పదాలను చేర్చింది. దేశ చరిత్రలో ఎమర్జెన్సీ విధించి ప్రజల హక్కులను కాలరాసిన పార్టీ కాంగ్రెస్.ఆపరేషన్ సిందూర్ విషయంలో భారత సైనికుల త్యాగాలను కించపరిచేలా మాట్లాడే వాళ్లు ప్రజల ముందుకి వచ్చి క్షమాపణ చెప్పాలి.బడుగు, బలహీన వర్గాల కోసం మోదీ ప్రభుత్వం కృషిచేస్తోంది. స్వయంగా ప్రధానమంత్రి మోదీ గారే బ్యాక్‌వర్డ్ క్లాస్‌కు చెందినవారు.బిజెపి పాలిత రాష్ట్రాల్లో సగం మందికిపైగా ముఖ్యమంత్రులు బ్యాక్‌వర్డ్ వర్గాలకు చెందినవారే ఉన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో బిజెపికి విశేష ఆదరణ లభిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో 8 ఎమ్మెల్యేలు, లోక్‌సభలో 8 ఎంపీ స్థానాల్లో గెలుపుతో పాటు, తాజాగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో 3 సీట్లలో విజయం సాధించాం. ఇవి బిజెపి బలపడుతున్న సంకేతాలు. రాష్ట్ర వ్యాప్తంగా ఓటు శాతం స్థిరంగా పెరుగుతుండటం ప్రజల విశ్వాసానికి నిదర్శనం. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసింది. అసలు ఆ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే ఆలోచన లేదు. కేవలం బీసీలను బిజెపి పార్టీ నుంచి డైవర్ట్ చేసేందుకే రిజర్వేషన్ల హామీ ఇచ్చింది.42 శాతం రిజర్వేషన్ల విషయంలో తీసుకొచ్చిన బీసీ బిల్లుకు బిజెపి మద్దతు ఇచ్చింది. దాన్ని అమలు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదే నన్నారు..కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఏడాది 2 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. బీఆర్ఎస్ ప్రభుత్వం పోయే సమయానికి రాష్ట్రంలో లక్షా 30 వేల ఉద్యోగ ఖాళీలు ఉండేవి. మరి ఆ ఖాళీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు భర్తీ చేయలేదు..?తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం నరేంద్ర మోదీ ప్రభుత్వం రూ. 12 లక్షల కోట్ల నిధులు ఇచ్చింది. దీనిపై కాంగ్రెస్ చర్చకు సిద్ధమా..? అని ప్రశ్నించారు.

# గోషామహల్‌లో కూడా ఉప ఎన్నిక జరుగానుందా....!?



హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) : దపంటి కింద రాయిలా పరిణమించిన గోషామహల్ శాసనసభ్యుడు రాజాసింగ్‌ను వదిలించుకోవాలని బీజేపీ భావిస్తున్నట్టు తెలుస్తున్నది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక తీరుపై కేంద్ర నాయకత్వం మీద నిరసన గళం విప్పిన రాజాసింగ్ ఏకంగా పార్టీకి రాజీనామా చేస్తూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి లేఖ రాశారు. ఈ లేఖ ఆధారంగా స్పీకర్‌కు లేఖ రాసి తన అసెంబ్లీ సభ్యత్వాన్ని కూడా రద్దు చేయించాలని మాట్లాడారు. తాను ఇక ఏమాత్రం బీజేపీ సభ్యుడిని కానని కూడా ప్రకటించారు. దీంతో ఇదే అదునుగా ఆయనను పార్టీ నుంచి బయటకు పంపాలని రాష్ట్రంలోని పలువురు నేతలు పావులు కదుపుతున్నట్టు తెలిసింది. ఒకవేళ బీజేపీ కేంద్ర నాయకత్వం సమ్మతిస్తే జూలై నెలాఖరులోపే రాజాసింగ్ వ్యవహారం తేలిపోతుందని బీజేపీ వర్గాలు చెప్తున్నాయి. పార్టీతోపాటు అసెంబ్లీ స్పీకర్ కూడా ఆయన రాజీనామాను ఆమోదిస్తే గోషామహల్‌లో ఉప ఎన్నిక తప్పదని తెలుస్తున్నది. జూబ్లీహిల్స్‌తోపాటే గోషామహల్‌కు కూడా ఉప ఎన్నిక జరిగే అవకాశాలు ఉంటాయి. బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు అక్టోబర్‌లో షెడ్యూల్ విడుదల కానుంది. అప్పుడే రాష్ట్రంలోని ఈ రెండు నియోజకవర్గాలకు కూడా ఉప ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది.పలుమార్లు పార్టీని, పార్టీ నేతలను ఇరుకున పెట్టేలా వ్యవహరించిన రాజాసింగ్‌ను వదిలించుకోవడానికి ఇదే కలిసి వచ్చిన సమయమని వారు భావిస్తున్నట్టు సమాచారం. ఇంకెంతకాలం ఆయనను భరించాలని పలువురు నేతలు పార్టీ అధిష్ఠానం పెద్దల వద్ద ప్రస్తావించినట్టు తెల్సింది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్, సంస్థాగత వ్యవహారాల జాతీయ కార్యదర్శి తదితరులకు ఇదే విషయాన్ని రాష్ట్ర పార్టీ నివేదించినట్టు సమాచారం. ఈ మేరకు రాష్ట్ర పార్టీ కేంద్ర పార్టీకి ఒక లేఖను కూడా పంపినట్టు తెలిసింది. లేఖపై సంతకం చేసిన వారిలో కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండిసంజయ్, కొత్త అధ్యక్షుడు రాంచందర్‌రావు సహా ముఖ్య నేతలంతా ఉన్నట్టు చెప్తున్నారు. కేంద్ర నాయకత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ ఇస్తే స్పీకర్‌కు రాజాసింగ్‌పై పార్టీ నిర్ణయాన్ని వివరిస్తూ లేఖ రాయాలని నిర్ణయించినట్టు తెలిసింది. పార్టీ ఆదేశాలు వస్తే అప్పుడు స్పీకర్‌కు లేఖ ఇస్తామని బీజేపీకి చెందిన కీలక నేత ఒకరు 'నమస్తే తెలంగాణ'తో ధ్రువీకరించారు.

# భర్త హత్య చేసిన భార్య....




హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) : హైదరాబాద్ నగర శివారులోని బాచుపల్లిలో దారుణం చోటుచేసుకుంది. ప్రియుడితో మాట్లాడొద్దని చెప్పిన భర్తపై ఆగ్రహించిన భార్య అతన్ని హత్య చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. మద్యం మత్తులో ఉన్న భర్తను గొంతు నులిమి హత్య చేసిన వ్యక్తి మరెవరో కాదు... భార్య రాధే.మృతుడు అంజిలప్పను ఆమె రాత్రి హత్య చేసిన తర్వాత ఇది ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించింది. అంత్యక్రియల కోసం భర్త మృతదేహాన్ని తన స్వస్థలమైన మహబూబ్‌నగర్ జిల్లా గ్రామానికి తరలించింది. అయితే శవంపై అనుమానాస్పద గాయాలుండటంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. విచారణలో అనేక అనుమానాస్పద విషయాలు వెల్లడయ్యాయి. మృతుడి గొంతుపై ఉన్న గాయాలపై విచారణ జరిపిన అధికారులు రాధను కఠినంగా ప్రశ్నించగా... చివరకు తానే హత్య చేశానని ఆమె అంగీకరించింది.ఈ మేరకు కేసు నమోదు చేసిన బాచుపల్లి పోలీసులు రాధను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రస్తుతం కేసు మరింత దర్యాప్తులో ఉంది.

# జగిత్యాల జిల్లా కోరుట్లలో మాస్ట్రో కళాశాల ఫ్రెషర్స్ ఫెస్టివల్...



కోరుట్ల(ఆకాంక్ష న్యూస్) : జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని ముక్కాస్ ఫంక్షన్ హాల్లో మాస్ట్రో జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో శనివారం 'ఫ్రెషర్స్ ఫెస్టివల్ – 2025' వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. సీనియర్ విద్యార్థులు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉత్సాహభరితంగా స్వాగతం పలికారు. తెలంగాణ సాంప్రదాయాన్ని ప్రతిబింబించేలా సినీ, జానపద నృత్యరూపకాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రతిభకు ఫుల్ మార్కులు వేస్తూ, ప్రేక్షకులు హర్షధ్వానాలు చేశారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఆకుల రాజేష్ మాట్లాడుతూ, "విద్యార్థులు ఆసక్తితో చదివి, భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలి," అని ఆకాంక్షించారు.ఈ వేడుకల్లో ప్రైవేట్ కళాశాలల కరస్పాండెంట్లు బారీ, మహదేవ్, సత్యనారాయణ, దీపక్, రమేష్, వెంకటేష్, శ్రీనివాస్, రాజేంద్ర ప్రసాద్, నరేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. కళాశాల ప్రాంగణాన్ని ఉత్సవ వాతావరణంగా మార్చిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

# మృతి చెందిన స్నేహితురాలి పిల్లల భవిష్యత్తుకు స్నేహితుల ఉదారత...



హుజూరాబాద్(ఆకాంక్ష న్యూస్) : హుజూరాబాద్‌లోని కాకతీయ కాలనీకి చెందిన బుర్ర కవిత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె చిన్ననాటి స్నేహితులు ఆమె కుటుంబానికి అండగా నిలిచి మానవీయత చాటుకున్నారు. కవిత బిడ్డల భవిష్యత్, విద్యా అవసరాల నిమిత్తం మూడు తరగతుల స్నేహితులు కలసి ముందుకొచ్చారు.విశ్వప్రగతి విద్యాలయం 1998%-%99 పదోతరగతి బ్యాచ్, కాకతీయ జూనియర్ కళాశాల 1999%-%2001 బ్యాచ్, శాతవాహన డిగ్రీ కళాశాల 2001%-%04 బ్యాచ్ విద్యార్థులు ఆర్థిక సాయం అందజేశారు. ఇందులో భాగంగా కవిత కూతురు సుప్రీతి భవిష్యత్ అవసరాల నిమిత్తం రూ.2 లక్షలను బ్యాంకులో డిపాజిట్ చేశారు. ఈ సందర్భంగా శనివారం జరిగిన కార్యక్రమంలో సుప్రీతికి బ్యాంకు ధృవపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ్, శ్రీనివాస్, రాజు, అశోక్, శ్రీశైలం, సత్యం, గోవర్ధన్, సంజయ్, వనిత, స్వప్న, నర్మద, వెంకటేష్, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.స్నేహితుల అండగా నిలిచిన నిబద్ధతకు బాధిత కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఉదారత అందరికీ ప్రేరణగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.

# నృసింహ నామస్మరణతో మార్మోగిన గిరిప్రదక్షిణ




యాదగిరిగుట్ట(ఆకాంక్ష న్యూస్) : తెలంగాణ తిరుపతి గా పేరుగాంచిన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహాస్వామి వారి జన్మ నక్షత్రం ' స్వాతి ' సందర్భంగా శనివారం గిరి ప్రదక్షిణ స్వామివారి నామస్మరణతో భక్తజన ప్రవాహంలా కొనసాగింది. తెల్లవారు జామున కొండకింద శ్రీ స్వామి వారి వైకుంఠ ద్వారం పా దాలచెంత పూజలు చేసి గిరిప్రదక్షిణ ప్రారంభించారు. అనేక మంది భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించారు. నుదుట తిలకం దిద్దుకుని స్వామిని జపిస్తూ వేలాదిమంది తండోపతండాలుగా వృద్ధులు, మహిళలు, పిల్లలు కూడా ముందుకు సాగారు. ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. కొండ చుట్టూ కాలినడకన ప్రదక్షిణ అనంతరం ఎక్కడైతే ప్రా రంభించారో అక్కడికి చేరుకోగానే అనేక మంది మెట్ల మార్గం గుండా కొండపైకి చేరుకొన్నారు. ఆలయంలో శ్రీ లక్ష్మీ నరసింహాస్వామి వారిని దర్శించుకున్నారు. స్వాతి నక్షత్రం సందర్భంగా గర్భాలయంలో మూలవరులకు అష్టోత్తర శత ఘటాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ వేంకటేశ్వర అన్నమాచార్య సేవా ట్రస్టు ( తెలంగాణ రాష్ట్రం)బృందం వారి కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. శ్రీమతి మీనాక్షి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నృత్య ప్రదర్శన గిరిప్రదక్షిణ కు మరింత ఆధ్యాత్మిక శోభను సంతరింప జేసింది.

# ఈ నెల 12న ఉస్మానియా యూనివర్సిటీకి రానున్నభారత ప్రధాన న్యాయమూర్తి



హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) : భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ఈ నెల 12న ఉస్మానియా యూనివర్సిటీకి రానున్నారు. మధ్యాహ్నం మూడున్నర గంటలకు ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించనున్న కార్యక్రమంలో "భారత రాజ్యాంగం: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సహకారం" అనే అంశంపై ఆయన ప్రసంగించనున్నారు. విద్యార్థులకు రాజ్యాంగంలోని కీలకమైన అంశాలను అవగాహన చేసుకునేందుకు ఈ ఉపన్యాసం తోడ్పడుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు.